# వరంగల్ వార్త

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు

బుధవారం 13, మే 2026 | 16 పేజీలు




## ఉన్నతాధికారుల మెప్పు కోసమే పురాతన విగ్రహాల



# హడావిడి..!?

మ్యూజియం నిర్మాణం పూర్తికాకముందే విగ్రహాల ప్రతిష్ట...!

అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు..!



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహా దేవపూర్ మండలం కాళేశ్వరం ఈనెల 21 నుండి జూన్ 1 వరకు జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాలకు ప్రారంభోత్సవం కావలసిన మ్యూజియం పుష్కరాలకు పది రోజుల ముందే గుట్టు చప్పుడు కాకుండా పురాతన విగ్రహాలు అమర్చడంలో ఆంతర్యమేమిటని భక్తులు స్థానికులు చెవులు కొరుక్కుంటున్నారు. ఒకపక్క మ్యూజియం నిర్మాణం పనులు జరుగుతుండగా అంగు ఆర్భాటాలు లేకుండా విగ్రహాలు అమరుస్తుం డడంతో అధికారుల తీరుపై భక్తులు చరిత్రకారుల నుంచి ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. మహాదేవపూర్, మే 12, ప్రభాతవార్త

2లో

## పే నియర్‌యాప్ నిర్వహకుడి

# మోసాలు..

Pay Nearby

Zidd aage badhne ki

2లో

బయ్యారం, ప్రభాతవార్త: బయ్యారం మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయతీ పరిధిలో పే నియర్ బై యాప్‌తో సామాన్యుల బ్యాంకు ఖాతాల సొమ్మును దొంగలిస్తూ అడ్డంగా దొరికిన సదరు యాప్ నిర్వహకుడు. వివరాల్లోకి వెళితే అల్లిగూడెం, రామచంద్రపురం, మొట్ల తిమ్మాపురం, భద్రుతండా, రెడ్యాతండా, కస్తూరి నగరం, సింగారం, పెంకుతండా గ్రామాల్లో సామాన్యుల బ్యాంకు ఖాతాలలో వారి అనుమతి లేకుండానే బయో మెట్రిక్ పై వేలిముద్ర వేసి ఖాతాలో ఉన్న డబ్బులను తక్కువ చూపి చెబుతూ వారి డబ్బులను దర్జాగా యాప్ నిర్వహకుడి ఖాతాలోకి బదిలీ చేసినట్లు అనేక సంఘటనలు వెలుగులోకి వచ్చాయి.

- ఒక్కొక్కటిగా బయటపడుతున్న వైనం..!
- గిరిజన నిరక్ష్యరాస్యులే వారికి టార్గెట్
- బయెమెట్రిక్ వేలిముద్రతో యాప్ నిర్వహకుడు మనీ డ్రా..!
- బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు

2లో



వీలైతే ప్రైవేటు గోదాములను తీసుకోండి

## రైతులకు ఇబ్బందులు

# తలెత్తకూడదు

- మక్కలు,ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రశీదులు ఇవ్వాలి
- హమాలీలను పూర్తి స్థాయిలో వినియోగించాలి
- వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ లతో సీఎం రేవంత్ రెడ్డి







# పే నియర్‌యాప్ నిర్వహకుడి మోసాలు..

### ఒక్కొక్కటిగా బయటపడుతున్న వైనం..!

### గిరిజన నిరక్ష్యరాస్యులే వారికి టార్గెట్

### బయోమెట్రిక్ వేలిముద్రతో యాప్ నిర్వహకుడు మనీ డ్రా..!

### బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు

**బయ్యారం,మే12,ప్రభాతవార్త:** బయ్యారం మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయతీ పరిధిలో పే నియర్ బై యాప్‌తో సామాన్యుల బ్యాంకు ఖాతాల సొమ్మును దొంగలిస్తూ అడ్డంగా దొరికిన సదరు యాప్ నిర్వహకుడు. వివరాల్లోకి వెళితే అల్లిగూడెం, రామచంద్రపురం, మొట్ల తిమ్మాపురం, భద్రుతండా, రెడ్యాతండా, కస్తూరి నగరం, సింగారం, పెంకుతండా గ్రామాల్లో సామాన్యుల బ్యాంకు ఖాతాలలో వారి అనుమతి లేకుండానే బయోమెట్రిక్ పై వేలిముద్ర వేసి ఖాతాలో ఉన్న డబ్బులను తక్కువ చూపి చెబుతూ వారి డబ్బులను దర్జాగా యాప్ నిర్వహకుడి ఖాతాలోకి బదిలీ చేసినట్లు అనేక సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. భద్రుతండాకు చెందిన ధర్మసోత్ హరిలాల్ ఈ నెల 1న తన ఆధార్ కార్డుతో పే నియర్ యాప్ ద్వారా మినీ బ్యాంక్ సెంటర్ నడుపుతున్న తొట్టి అశోక్ దగ్గరికి వెళ్లి తమ ఖాతాలో సొమ్ము వివరాలను చెప్పమని అడగ్గా ఖాతాలో సొమ్ము 2700 ఉండగా 2020ఉన్నాయని చెప్పి బాధితుడికి 2000 ఇచ్చి 700రూపాయలు తమ ఖాతాలో జమ చేసుకున్నట్లు తెలియడంతో తమ సొమ్మును అక్రమంగా కాజేశాడని ఈ నెల 11న స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. పెంకుతండాకు చెందిన గుగులోతు దస్మా ఈ నెల 2న తమ ఆధార్ కార్డు తీసుకొని హర్షిత మినీ బ్యాంకుకు వెళ్లి తమ ఖాతా వివరాలను చూడమని తొట్టి అశోక్ అడగ్గా ఖాతాలో 4500 ఉన్నాయని 4000 ఖాతాదారునికి ఇచ్చినట్లు సమాచారం. అసలు ఖాతాలో 6000 ఉండగా 4500చూపెట్టి 1500రూపాయలు కాజేశాడనే ఖాతాదారుడు వాపోయాడు. ఇలా ఒకే నెలలో ఐదు నుంచి పదిమంది నిరక్ష్యరాస్యుల ఖాతాలో వారికి తెలియకుండా డబ్బులు డ్రా చేస్తూ గత పది సంవత్సరాల నుండి పే నియర్ యాప్ ద్వారా మినీ బ్యాంకు సెంటర్ నడుపుతూ మండలంలో వేలాదిమంది ఖాతాల నుండి కోట్ల రూపాయలు దోపిడి చేసినట్లు పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మినీ బ్యాంకు మనీ దోపిడిపై ఒక్కొక్కరుగా బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇప్పటి వరకు ముగ్గురు పిర్యాదు చేసినట్లు బాధితుల నుండి సమాచారం. మరి కొంతమంది బాధితులు పోలీసులకు పిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రామచంద్రపురంలో మినీ బ్యాంక్ దోపిడిపై లోతుగా విచారణ జరిపి ఖాతాదారులకు తెలియకుండా ఆర్థికనేరం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు పోలీసులను వేడుకుంటున్నారు. దీనిపై యాప్ నిర్వహకుడు తొట్టి అశోక్ తన అసలు బండారం బయట పడకుండా గుగులోతు రాజలి సంబందించిన డబ్బులు దొంగతనంగా కొట్టేసిన మహిళ కళ్లా, వేళ్లా బ్రతిమిలాడుతూ వారికి రాజకీయ నాయకులతో ఫోన్‌ల ద్వారా బెదిరింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేసును వాపస్ తీసుకోవాలని పరువు తీయవద్దని వేడుకుంటున్నట్లు గ్రామస్థుల నుండి సమాచారం. అదే విధంగా పే నియర్ యాప్ నిర్వహకులు మినీ సెంటర్ ఐడిని బ్లాక్ చేసినట్లు సమాచారం. గత పది సంవత్సరాల నుండి రైతులకు, కూలీలకు, రైతుబంధు పథకం, గ్రామీణ ఉపాధిహామి పథకం, రైతుల ధాన్యం విక్రయాలు, తునికాకు సేకరణ డబ్బులు గిరిజనుల ఖాతాల్లో పడడం గిరిజనులు సదరు యాప్ నిర్వహకుడు దగ్గరికి వెళ్లడం మోసపోవడం గ్రామస్థులు గ్రహించలేకపోయారు. దీనిపై ఎస్సై ప్రశాంత్ బాబు వివరణ కోరగా కొంతమంది బాధితులు తమ డబ్బులు మినీ బ్యాంకు నిర్వహకుడు దొంగలించాడని పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు తెలిపారు.

# కొండగట్టు అంజన్నకు భక్తజన హారతి

### భక్తుల కొండంత భక్తితో పులకరించిన అంజన్నాలయం

### వైభవంగా పెద్ద హనుమాన్ జయంతి

### వేల సంఖ్యలో దర్శించుకుని మాల విరమణ చేసిన భక్తులు

### ఆలయానికి అర్ధరాత్రి పోటెత్తిన అంజన్న భక్తులు

### జయంతి ఉత్సవాలకి హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**మల్యాల , ప్రభాతవార్త** తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో మంగళవారం పెద్ద జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి, జయంతి సందర్భంగా రాష్ట్ర నలుమూలలే కాకుండా చుట్టుపక్కల ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్గడ్ రాష్ట్రాల నుండి కూడా స్వామివారి దీక్షలు చేపట్టిన భక్తులు సోమవారం అర్ధరాత్రి నుండి తమ అధ్యక్షుల విరమణకు కొండగట్టుకు చేరుకున్నారు, దీంతో ఆలయంలో అర్ధరాత్రి నుండి తెల్లవారు 3 వరకు భక్తుల రద్దీ కొనసాగింది, జై శ్రీరామ్ జై హనుమాన్,,,, రామలక్ష్మణ జానకి జై బోలో హనుమాన్ కి,,,,, నినాదాలతో కొండగట్టు ఆలయ పరిసరాలు కాషాయ వర్ణమై మారుమోగాయి, హనుమాన్ దీక్షలకు కేంద్రంగా పేరుగాంచిన కొండగట్టు అంజన్న ఆలయం సంవత్సరంలో రెండుసార్లు చిన్న, పెద్ద జయంతి ఉత్సవాలు జరగడం విశేషం,కాగా, ఆదివారం ప్రారంభమైన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు మూడు రోజులపాటు వైభవంగా జరిగాయి, స్వామివారి పుట్టినరోజు జరిగే పెద్ద హనుమాన్ జయంతికి 21 31 41 రోజుల దీక్షలు చేపట్టిన భక్తులు కొండగట్టు అంజన్న సన్నిధికి చేరుకొని మాల విరమణ మండపంలో తమ దీక్షలు నిర్వహించుకున్నారు, వందలాది కిలో మీటర్ల దూరం నుండి స్వామి వారి దీక్షలు స్వీకరించిన భక్తులు కాలినడకన పాదాలకు సాక్స్ ధరించి కొండపైకి నగర సంకీర్తనలతో తరలి రావడంతో కొండగట్టు అంజన్నాలయం ఆధ్యాత్మిక వాతావరణంతో పులకరించి పోయిం ది, జయంతి సందర్భంగా భక్తులకు ఇబ్బం దులు కలగకుండా జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఎస్పీ అశోక్ కుమార్ లు సోమవారం అర్ధరాత్రి వరకు కొండగట్టులోనే మకాం వేసి ఏర్పాట్లను పరిశీలించారు, ఆలయంలో భక్తులకు తాగునీరు మరుగుదొడ్లు వైద్య సేవలు ట్రాఫిక్ నియంత్రణ వంటి మోలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా అధికారులకు ఎప్పటికప్పుడు ఏర్పాట్లపై సూచనలు అందజేసి జయంతి ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించారు,

### కొండంత మార్మోగిన రామనామ జపం

అంజన్న పుట్టినరోజు సందర్భంగా కొండగట్టుకు తరలివచ్చిన దీక్ష స్వాములతో కొండగట్టు పరిసరాలనే కాషాయం మారాయి, అంతేకాకుండా ఆలయ పరిసరాలు భక్తుల రామనామ జపంతో కొండగట్టు మారుమోగింది, దీక్షల విరు మనకు వందల కిలోమీటర్ల నుండి వచ్చిన భక్తులు కాలినడకన కొండపైకి చేరుకుని దీక్షలు విరమించుకొని స్వామివారిని మనసారా దర్శించు కున్నారు, ఈ సందర్భంగా ఇరుముడితో వచ్చిన దీక్ష స్వాములు స్వామివారి సన్నిధిలో మాల విరమణ తో పాటు ఇరుముడిని స్వామివారి సన్నిధిలో అప్పగించి అంజన్నను తమ కోరికలు నెరవేరాలని ప్రార్థించుకు న్నారు,

మూడు రోజులపాటు జరిగిన జయంతోత్సవాలకు సుమారు రెండు లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

### స్వామివారికి విశేష పూజలు నిర్వహించిన వేద పండితులు

స్వామి వారి జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం 3 నుండి సాయంత్రం 6 వరకు ఆలయంలో ద్రావిడ ప్రబంధన కార్యక్రమాలు, పారాయణలు, విశేషాలు తులసి అర్చ,న శ్రీ స్వామివారికి పట్టు వస్త్రాల అలంకరణ, సహస్ర నాగవల్లి, హోమాలు, మహా పూర్ణాహుతి, స్థాపిత ఉత్సవమూర్తికి ఉయ్యాల సేవ, మంత్రపుష్పం, మహనీవేదన, తీర్థ ప్రసాదాల వియోగం తో పాటు సామూహిక విష్ణు పారాయణము, అమ్మ వారికి కుంకుమార్చన, ఒడిబియ్యం, ఆలయంలో సహస్రదీపాలంకరణ, గరుడ వాహన సేవ, కుంకుమార్చన, మంత్రపుష్పం, మహా దాశీర్వాదం, సామూహిక భజన ,ప్రత్యేక అభిషేకాల , ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు.

### స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారి జయంతికి హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు, అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ధర్మానికి ప్రతికగా అచంచలమైన సేవా భావానికి ఆదర్శంగా నిలిచిన ఆంజనేయ స్వామి వారి కృపా కటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు, అంతేకాకుండా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ముఖ్యంగా రైతాంగానికి సమృద్ధిగా వానలు కురిసి పంటలు అధికంగా పండాలని స్వామివారిని వేడుకు న్నట్లు తెలిపారు, హనుమంతుని భక్తి బలం నిస్వార్థ సేవాస్ఫూర్తి ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవలో మరింత నిబద్ధతతో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు,







# ఉన్నతాధికారుల మెప్పు కోసమే పురాతన విగ్రహాల హడావిడి..!?

### మ్యూజియం నిర్మాణం పూర్తికాకముందే విగ్రహాల ప్రతిష్ట...!

### అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు..!

**మహాదేవపూర్, మే 12,** ప్రభాతవార్త జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం ఈనెల 21 నుండి జూన్ 1 వరకు జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాలకు ప్రారంభోత్సవం కావలసిన మ్యూజియం పుష్కరాలకు పది రోజుల ముందే గుట్టు చప్పుడు కాకుండా పురాతన విగ్రహాలు అమర్చడంలో ఆంతర్యమేమిటని భక్తులు స్థానికులు చెవులు కొరుక్కుంటున్నారు. ఒకపక్క మ్యూజియం నిర్మాణం పనులు జరుగుతుండగా అంగు ఆర్భాటాలు లేకుండా విగ్రహాలు అమరుస్తుం డడంతో అధికారుల తీరుపై భక్తులు చరిత్రకారుల నుంచి ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల మెప్పు కోసమే తొందరపాటు నిర్ణయా లు తీసుకుంటున్నారని దీనివల్ల విగ్రహాల భద్రత విలువలు దెబ్బతీసే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మ్యూజియం పనులు పూర్తి కాకుండానే విగ్రహాలు అమర్చడంతో వాటిపై దుమ్ము దూళితో విగ్రహాలు దెబ్బతినే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమో తుంది. చారిత్రాత్మక విగ్రహాలను మ్యూజియంలో అమర్చే ముందు శుద్ధి చేయాలని పలువురు సూచిస్తున్నారు. అంత్య పుష్కరాలు సమీపిస్తుం డడంతో తనిఖీలకు వచ్చే ఉన్నతాధికారులను మెప్పించడానికి దేవస్థానం అధికారులు ఇలాంటి నిర్ణయాలకు పూనుకుంటున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

# సీఎంఆర్ఎఫ్ తో ఆర్థిక భరోసా.



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.

**చిట్యాల, మే 12 ప్రభాతవార్త:** సీఎం రిలీఫ్ ఫండ్ తో అనారోగ్యం బారిన పడిన వ్యక్తులకు ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం రైతు వేదికలో చిట్యాల, టేకుమట్ల మండలాలకు చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో ఆడబిడ్డలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. అదే తరహాలో వివిధ వ్యాధుల బారిన ప్రైవేట్ ఆస్పత్రిల్లో చికిత్స పొందిన, బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఏ పథకం ఎంతగానో ఉపకరిస్తుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నారు అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్పర్సన్ గుమ్మడి శ్రీదేవి, తహసిల్దార్ వసంతరావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధు వంశీకృష్ణ , టేకుమట్ల మాజీ జెడ్పిటిసి పులి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ కటుకూరి పద్మ నరేందర్, గుంటూరు పల్లి , సి ఆర్ పల్లి , నవాబుపేట , నైన్ పాక సర్పంచ్ లు మల్లేశ్వరరావు, కోడారి అశోక్, పర్లపల్లి రవి, నక్క భాస్కర్, బాధితులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బండి సంజయ్‌ని మంత్రి పదవి నుండి భర్తరఫ్ చేయాలి




**నర్సంపేట, మే 12, ప్రభాతవార్త**

17 ఏళ్ల మైనర్ బాలికకు మద్యం తాగించి అత్యాచారానికి పాల్పడి ఓ యువతి జీవితంతో చెలగాటమాడిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డమీది బాలకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పైస గణేష్,మహిళా సంఘం జిల్లా నాయకులు ఎండీ ఫరీదా, మాట్లాడుతూ తనపై బండి భగీరథ మద్యం తాగించిఅత్యాచారానికి పాల్పడ్డాడని తన తల్లిని తోడుకొని వచ్చి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే 8 గంటల పాటు పోలీసులు ఫిర్యాదు తీసుకోకపోవడం పోలీసుల వైఖరి ఏమిటో అర్థం అవుతుందన్నారు. చట్టం ముందు అందరూ సమానులే అనేవిదంగా రాజ్యాంగబద్ధంగా పోలీసులు వ్యవహరించాలని చెప్పారు. బండి సాయి భగీరథ తన తండ్రి కేంద్ర హోంశాఖ మంత్రిగా ఉన్నాడనే అండదండతో తాను చదువుకున్న టెక్ మహేంద్ర విద్యాసంస్థలో ర్యాగింగ్ కు భౌతిక దాడులకు పాల్పడటం, మద్యం మత్తులో సహ విద్యార్థులపై అరాచకాలు చేయడం అయన ఆరాచకాలు పరిపాటిగా మారిందన్నారు. మైనర్ బాలికపై అత్యాచారం చేయడమే కాకుండా తమను హనీ ట్రాప్ చేశారని కేసులు తప్పుదోవ పట్టించడానికి కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారని విమర్శించారు. ఆ యువతికి ప్రాణహాని పొంచి ఉందని తక్షణమే సాయి భగీరథను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా ఆ యువతీని ఫోన్లో బెదిరించాడని ఇంటికి పిలిపించి వార్నింగ్ ఇచ్చాడని అందుకుగాను బండి సంజయ్ ని మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి దేశభక్తి మాటలు భారత్ మాతాకీ జై అనే నినాదాలు వట్టి నీటి మూటలేనని ఇలాంటి ఘటనలు కోకోల్లలుగా జరిగాయని చెప్పారు. సాయి భగీరథను అరెస్ట్ చేయకపోతే ప్రజాసంఘాలు విద్యార్థి సంఘాలు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేపడుతామని హెచ్చరించారు. ఈ ప్రజాసంఘాల నాయకులు కలకోట అనిల్, రుద్రారపు లక్ష్మి, ఉదయగిరి నాగమణి, ఉదయగిరి సరిత, యాక లక్ష్మి, బి లక్ష్మి, తాళ్లపల్లి రాజు, కరుణాకర్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జనగణన ప్రక్రియను పరిశీలించిన రాష్ట్ర డైరెక్టర్



**నర్సంపేట, మే 12, ప్రభాతవారనత**

జనగణన ప్రక్రియను రాష్ట్ర డైరెక్టర్ సెన్సెస్ ఆపరేషన్ జెడి సుబ్బరాజు మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో ఉన్న ఒకటవ హెచ్.ఎల్.బి ని సందర్శించి పరిశీలించారు. 11 నుంచి ప్రారంభమైన జనగణన ప్రక్రియ మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులలో 105 హెచ్.ఎల్.బిలు గా విభజన చేసి 16 మంది సూపర్వైజర్ లు,95 మంది ఎన్యూమరేటర్లతో జనగణన ఇళ్ల జాబితా ప్రక్రియ కొనసాగుతుంది. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్ జేడీ సుబ్బరాజు మాదన్నపేటలోని ఇళ్ల జాబితా నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ ఎన్యూమరేటర్లకు కేటాయించిన బ్లాక్‌లోని అన్ని రకాల ఇళ్ళను నమోదు చేయాలని, మ్యాపుల తయారు చేయడంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎన్యూమరేటర్‌లు సూపర్వైజర్ల నిర్వహణ జనగణలో మార్గదర్శకంగా ఉండాలన్నారు. అన్ని క్షుణ్ణంగా పరిశీలన చేసి నమోదు చేయాలని కోరారు. జనగణన ప్రక్రియను అధికార యంత్రాంగంతో పాటు సంబంధిత ఎన్యూ మారేటర్ లు, సూపర్వైజర్ లు, సమర్థవంతంగా పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో చార్జి ఆఫీసర్ మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, స్టాటికల్ ఆఫీసర్ సతీష్, అడిషనల్ చార్జ్ ఆఫీసర్ విజెందర్, సూపర్వైజర్ సర్దార్,ఎన్యూమరేటర్ చంద్రమోహన్ లు పాల్గొన్నారు.

# బలహీన విద్యార్థుల అభివృద్ధి కోసం సమ్మర్ క్యాంపు




**నర్సంపేట, మే 12, ప్రభాతవార్త**

ఎస్ఎస్సీ లో బలహీన విద్యార్థుల కోసం వేసవి సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కొర్ర సారయ్య అన్నారు. మంగళవారం ప్రధానమంత్రి స్కూల్ ఆఫ్ రేజింగ్ ఇండియా జిల్లా ప్రజా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోడెం కాంతారావు ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి బహునూతుల రంగయ్య నాయుడు ఆదేశాల మేరకు నర్సంపేట డివిజన్ మండలాలు నర్సంపేట, నల్లబెల్లి, ఖానాపురం, చెన్నారావుపేట, నెక్కొండ పాఠశాలలో పదవ తరగతి తప్పిన విద్యార్థులకు ప్రత్యేక ఉపాధ్యాయులచే ప్రత్యేక బోధన శిబిరం ఏర్పాటు చేశారు.. ఇట్టి కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడుతూ దుగ్గొండి మండలంలో 100 ఉత్తీర్ణత పొందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అభినందిస్తూ గతంలో ఆకలి కడుపుతో 8 కిలోమీటర్లు పాదయాత్రతో చదువులు కొనసాగి ఉన్నత స్థాయిలో ఉన్నాము వివిధ మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను 12 మే 2026 నుండి 03 జూన్ 2026 వరకు ఉదయం 08 గంటల నుండి మధ్యాహ్నం12 గంటల వరకు అల్పాహారం రహదారి ఖర్చులు 1000 ఒక వెయ్యి రూపాయలతో చక్కని బోధన కల్పించబడును. ప్రభుత్వం చక్కటి ఈ అవకాశం లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత పొంది రాష్ట్రానికి దేశానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పోడెం కాంతారావు, సంగెపు స్వరూప, బత్తిని రాజేష్, కందుల స్వామి, ల్యాద లింగమూర్తి, బానోతు వెంకట్రం, సమ్మెట సురేష్, లక్కి రమేష్, ఎమ్మార్పీ సభ్యులు, అన్ని మండలాల విద్యార్థిని విద్యార్థులు, పాల్గొన్నారు.

# ఉత్తమ డిగ్రీ ప్రిన్సిపాల్‌గా అవార్డు అందుకున్న డా.మల్లం నవీన్




**నర్సంపేట, మే 12, ప్రభాతవార్త**

నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్‌కి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికవిద్యా వారోత్సవాల కార్యక్రమంలో" భాగంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిపల్ పురస్కారం లభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారంతోపాటు కళాశాల అభివృద్ధి కోసం రూ.1,00,000/, రూ. 10,000/ నగదు ప్రోత్సాహక చెక్కును అందజేయడం కళాశాలకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ ఈ పురస్కారం తన వ్యక్తిగత విజయమే కాకుండా కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల సమిష్టి కృషికి లభించిన గుర్తింపని పేర్కొన్నారు. ఒక ప్రభుత్వ కళాశాల కూడా సంకల్పం, క్రమశిక్షణ, సమిష్టి కృషి ఉంటే రాష్ట్రంలోనే ఆదర్శ విద్యాసంస్థగా నిలవగలదని మేము నిరూపించామని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం మా బాధ్యత మాత్రమే కాదు, అది మా లక్ష్యం. ప్రతి విద్యార్థి జీవితంలో వెలుగునింపే విద్యా దీపంగా కళాశాలను నిలుపుతానని,విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, సాంకేతిక వనరులు, పరిశోధన, విద్యార్థుల అభివృద్ధి కార్యక్రమాలలో తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ కళాశాలగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి, ఉన్నత విద్యాశాఖ అధికారులకు, అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి, విద్యార్థుల తల్లి తండ్రులకు, విద్యార్థులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నేరాలు-దారుణాలు

### మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ నాయకులు



**చెన్నారావుపేట, మే 12, ప్రభాతవార్త**

మండలంలోని అమీనాబాద్ గ్రామంలో మృతుని కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు అండగా నిలిచారు. గ్రామానికి చెందిన అమ్మ చిరంజీవి అనే వ్యక్తి చాతినొప్పితో అకస్మాత్తుగా మృతిచెందారు. ఈ మృతిపట్ల నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ద్రిగ్భాంతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో మండల పార్టీ నాయకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు సిద్దెన రమేష్‌తో పాటు ఆ పార్టీ నాయకులంతా తమవంతు చేయూతనందించారు. మొత్తం వచ్చినటువంటి రూ.1లక్ష4వేల రూపాయలను బాధిత కుటుంబానికి వారు అందించారు. స్వచ్ఛందంగా అందరు ముందుకు రావడంతో బాధిత కుటుంబం వారికి కృతజ్ఞతలు తెలిపింది. ఆర్థిక సహాయమే కాకుండా తమవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని వారు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దార రంజిత్, ఉపసర్పంచ్, యూత్ మండల అధ్యక్షుడు బండి హరీష్, జిల్లా కార్యదర్శి కంది కృష్ణచైతన్యరెడ్డి, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### చెన్నారావుపేట స్నేహ సంఘాలు ర్ట్రాషానికే ఆదర్శం




**చెన్నారావుపేట, మే 12, ప్రభాతవార్త**

చెన్నారావుపేట మండలంలోని స్నేహ సంఘాలు రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని మండల స్పెషల్ ఆఫీసర్ డా.బాలకృష్ణ అన్నారు. స్థానిక రైతు వేదికలో కిషోర బాలికల స్నేహ సంఘాల సభ్యులకు వేసవికాలం క్యాంపెన్, శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఇందులో పాల్గొన్న మండల స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ సంఘాల ఏర్పాటుకు మహిళలు, బాలికల్లో చైతన్యం, ఐక్యత వచ్చిందన్నారు. వారి యొక్క కెరీర్ గైడెన్స్ ఆర్థిక సావలంభన మహిళా చైతన్యం, ప్రగతి, మహిళా సాధికారత వంటి అంశాల్లో వారు ముందున్నారన్నారు. కిషోర బాలికలు ఇదే స్పూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలలో పాల్గొంటూ ప్రగతిని సాధించాలన్నారు. ఇలాంటి వారిని ఎల్లప్పుడు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమానికి ఏపివో తిలక్ అధ్యక్షత వహించగా ఇందులో తహసీల్దార్ అబీద్ అలీ, ఎంపిడివో వెంకటసాయి శివానంద్, ఏపీడీ మౌనికలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

### పంచముఖ అంజనేయస్వామి ఆలయం మహాన్నప్రసాద వితరణ

**నెక్కొండ, మే 12, ప్రభాతవార్త**

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ ఎర్రబెల్లి సంపత్ రావు, వైస్ చైర్మన్ యాట పూర్ణ చందర్, కోశాధికారి మోడెం రాజు ఏర్పాటు చేసిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమంనికి హాజరై స్వామి వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు లావుడ్యా తిరుమల్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాస్, రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ, మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, రామాలయం కమిటీ డైరెక్టర్ గుంటుపల్లి ప్రభాకర్ రావు, బండి భాస్కర్ రెడ్డి, ముచ్చా వెంకటేష్ రెడ్డి, కంది నర్సింహా రెడ్డి బానోత్ బాలాజీ, గంధం సుధాకర్, తదితరులు భక్తులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశాల పెంపే లక్ష్యం

**కాటారం సర్పంచ్‌తో ఐటిఐ బృందం భేటీ**

**ఎనిమిది విభాగాల కోర్సులు, ఉపాధి అవకాశాలపై**

**అవగాహన కల్పించిన అధికారులు**

కాటారం, మే 12, ప్రభాతవార్త



స్థానిక ప్రభుత్వ ఐటిఐలో అడ్మిషన్ల సంఖ్యను పెంచే లక్ష్యంతో అడ్మిషన్ల ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరం చేసినట్లు కాటారం ఐటీఐ ప్రిన్సిపాల్ గైని శ్రీనివాస్ తెలిపారు. ఇందులో భాగంగా కాటారం సర్పంచ్ పంతకాని సదువలిని ఐటిఐ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని అర్హులైన యువత ఐటిఐలో చేరేలా ప్రోత్సహించాలని, స్థానిక మద్దతు అందించాలని సర్పంచ్‌ను కోరారు. సమావేశంలో ఐటిఐలో అందుబాటులో ఉన్న మొత్తం ఎనిమిది ట్రేడ్‌ల గురించి సర్పంచ్‌కు వివరించారు. ఒక్కో కోర్సు ప్రాముఖ్యత, ఆ కోర్సు పూర్తి చేసిన తర్వాత ఉండే కెరీర్ స్కోప్, ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాల్లో లభించే ఉపాధి అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సాంకేతిక విద్య ద్వారా యువత త్వరగా స్థిరపడవచ్చని, స్వయం ఉపాధికి కూడా ఐటిఐ కోర్సులు ఎంతో దోహదపడతాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. దీనికి సర్పంచ్ సానుకూలంగా స్పందిస్తూ, నిరుద్యోగ యువతకు ఈ అవకాశాలను చేరవేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐటిఐ సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## లెంకలగడ్డలో టీబీ ముక్త్ భారత్ పరీక్షా శిబిరం

**డిజిటల్ ఎక్స్ కిరణ పరీక్ష ద్వారా 32 మందికి వైద్య పరీక్షలు**

పలిమెల, మే 12,ప్రభాత వార్త:



జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య అధికారి డాక్టర్ శ్రీ చల్ల మధుసూదన్ ఆదేశాల మేరకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంబట్ పల్లి వైద్యురాలు డాక్టర్ శ్రీమతి తేజవత్ కళ్యాణి అధ్యక్షతన లెంకలగడ్డ గ్రామంలో టీబీ ముక్త్ భారత్ పరీక్షా శిబిరం నిర్వహించడం జరిగింది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల టీబీ ముక్త్ భారత్ ఉద్యమాన్ని గ్రామ స్థాయిలో విజయవంతంగా నిర్వహించారు. టీబీ ముక్త్ భారత్ అనగా గుర్తించబడని క్షయ వ్యాధి రోగులను త్వరగా గుర్తించి వారికి తగిన మందులు అందించి నయం చేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. 2030 సంవత్సరం నాటికి క్షయ రహిత భారత దేశాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ఈ మహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు.లెంకలగడ్డ అంగన్ వాడి కేంద్ర భవన ప్రాంగణంలో నిర్వహించిన ఈ శిబిరంలో డిజిటల్ ఎక్స్ కిరణ పరికరం ద్వారా 32 మందికి ఎక్స్ కిరణ పరీక్ష నిర్వహించారు. పరీక్ష ఫలితాల ఆధారంగా క్షయ వ్యాధి అనుమానం ఉన్న వారిని గుర్తించి వెంటనే చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటామని వైద్యురాలు తేజవత్ కళ్యాణి తెలిపారు.గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, క్షయ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని వైద్యులు సూచించారు. వి. సోనాజీ, కె. సత్యనారాయణ, జి. రమేష్, శ్రీకాంత్, ప్రసాద్, బి. బ్యూల, సి.హెచ్. శ్రీలత, సి.హెచ్. నిర్మల, జె. సమ్మక్క తదితర వైద్య సిబ్బంది పాల్గొని సేవలు అందించారు.

# నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**సర్వాయిపేట ఐకేపీ వడ్ల కొనుగోలు**

**కేంద్రంలో ఎంఏవో సంపత్ ఆదేశం**

**12శాతం మాయిశ్చర్,**

**తాలు లేని వడ్లనే కొనుగోలు చేయాలి**

పలిమెల,మే 12,ప్రభాత వార్త:



వడ్ల కొనుగోలులో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పలిమెల మండల వ్యవసాయ అధికారి సంపత్ ఐకేపీ కేంద్ర సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని సర్వాయిపేట ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.

**మాయిశ్చర్ 12శాతం మించకూడదు**

కొనుగోలు కేంద్రానికి వచ్చే వడ్లలో తేమ శాతం 12శాతం మించకుండా చూసుకోవాలని ఎంఏవో సంపత్ సిబ్బందికి స్పష్టం చేశారు. వడ్లను బాగా ఎండబెట్టి, తాలు, ఒలిపిడి, దుమ్ము, దూలి లేకుండా శుభ్రంగా తీసుకురావాలని రైతులకు తెలియజేయాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు లేని వడ్లను కొనుగోలు చేయకూడదని, అలా చేస్తే రైతులతోపాటు ప్రభుత్వానికి కూడా నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు.

**సకాలంలో కాంటా, సరైన తూకం......**

రైతుల నుంచి కొనుగోలు చేసిన వడ్లను సరైన తూకం వేసి, సకాలంలో కాంటా వేసి వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆయన సిబ్బందికి ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరగకుండా, పారదర్శకంగా వ్యవహరించాలని, రైతులకు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు."రైతులు కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర అందాలంటే నాణ్యత ప్రమాణాలు కీలకం. తేమ ఎక్కువగా ఉన్న వడ్లు తిరస్కరించబడతాయి. కాబట్టి సిబ్బంది రైతులకు ముందుగానే అవగాహన కల్పించాలి" అని సంపత్ అన్నారు.

**రైతులకు అందుబాటులో సిబ్బంది**

కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంఏవో సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాణ్యతతో కూడిన వడ్లనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని ఆయన పేర్కొన్నారు.

## మహాముత్తారం మండలంలో తునికాకు సేకరణ మొదలు

**అటవీ గ్రామాల్లో తునికి ఆకులు సేకరిస్తున్న గ్రామీణులు**

మహాముత్తారం, మే 12, ప్రభాతవార్త



మహాముత్తారం మండలంలో తునికాకు సేకరణ పనులు మంగళవారం ప్రభాతం నుంచి మొదలైంది. మండలంలోని ఆయా గ్రామాల్లో నివసించే ప్రజలు తునికాకు సేకరణ కోసం గ్రామ శివారుల్లోని అటవీ ప్రాంతాలకు తండోపా తండాలుగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రజలు ఉత్సాహంగా ఆకులు సేకరించారు.ఆకులు సేకరించిన తర్వాత ప్రజలు తమ ఇళ్లకు తీసుకువచ్చి, చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ ఒకే చోట కూర్చొని ముచ్చట్లతో కలిసి మెలిసి పని చేస్తున్నారు. ఆకులను జమ చేసి కట్టలు కట్టి, సమీపంలోని కళ్లలా వద్ద వాటిని పెట్టుబడి వేస్తున్నారు. తునికాకు పెట్టుబడి లేని పంటగా ప్రజలు భావిస్తున్నారు. ఇది ఆదాయం తెచ్చే మంచి అవకాశంగా పరిగణిస్తున్నారు. అయితే మండలంలో కొన్ని యూనిట్లు మాత్రమే టెండర్ కావడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. మిగిలిన యూనిట్లకు టెండర్లు ఎందుకు జారీ కాలేదని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ సమస్యకు త్వరగా పరిష్కారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## తాడిచర్ల జూనియర్ కళాశాలకు రాష్ట్ర వ్యాప్త గుర్తింపు

**ముఖ్యమంత్రి చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకం**

**అందుకున్న ప్రిన్సిపల్ విజయ దేవి**

మల్హర్ రావు, మే 12, ప్రభాతవార్త



మండల కేంద్రమైన తాడిచర్ల లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉత్తమ ఫలితాలతో రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు సాధించింది. 202526 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్రంలోనే ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గాను కళాశాల ప్రిన్సిపల్ విజయ దేవి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కళాశాల తరఫున నగదు ప్రోత్సాహకంగా లక్ష రూపాయలు చెక్కును అందు కున్నారు ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కి కళాశాల అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యా వారోత్సవాల్లో రెండవ రోజు అయినా మంగళవారం నాడు కళాశాల అధ్యాపకులు విద్యార్థుల కొరకు కాన్వాసింగ్ కౌన్సిలింగ్ మరియు మోటివేషన్ నిర్వహించారు.

## గుడుంబా స్థావరాలపై పోలీసుల మెరుపు దాడి

**35 లీటర్ల గుడుంబా పట్టివేత**

**కొయ్యూరు ఎస్సై 2 రాజన్ కుమార్ వెల్లడి**

మల్హర్ రావు, మే 12, ప్రభాతవార్త



మండలంలోని కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల అడ్వాలపల్లి గ్రామంలో గుడుంబా తయారు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న కోయ్యూరు పోలీసులు మంగళవారం గుడుంబా తయారీ కేంద్రాలపై మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 35 లీటర్ల గుడుంబాను పట్టుకొని,సుమారు 150 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు కొయ్యూరు ఎస్సై 2 రాజన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ఎంతో హాని కలిగించే నిషేధిత గుడుంబాను తయారుచేసిన విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడులలో కొయ్యురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొయ్యూరు నాగులమ్మ క్రాస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**రెండు లారీలు ఢీ.. ఒక లారీ డ్రైవర్ మృతి**

మల్హర్ రావు, మే 12, ప్రభాతవార్త



మండలంలోని కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల నాగులమ్మ క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న కొయ్యూరు పోలీసులు హుటా హుటేనా సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్, ఎస్సై 2 రాజన్ కుమార్ కథనం ప్రకారం కాటారం నుండి మంథని వైపు వెళుతున్న ఇసుక లారీని తాడిచర్ల నుండి బొగ్గు లోడుతో భూపాలపల్లి వెళుతున్న టిప్పర్ ఎదురెదురుగా బలంగా ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ప్రమాదంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన కేతి శ్రీనివాస్ అనే అనే లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా , మరో లారీ డ్రైవర్ సయ్యద్ అలీ రెండు కాళ్లు లారీ క్యాబిన్ లో ఇరుక్కుని తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుని 108 వాహనంలో గోదావ రిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి అజాగ్రత్త, మితిమీరిన వేగమే కారణంగా స్థానికులు తెలియ జేశారు. గాయపడిన డ్రైవర్ సయ్యద్ అలీ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్ తెలిపారు.

# భూ భారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగంపెంచాలి

**జనగామ, మే 12 ప్రభాతవార్త :**



భూ భారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో భూ భారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాలవారీగా పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై క్షుణ్ణంగా సమీక్షించి, పలుసూచనలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగంపెంచాలని, త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ -ఆఫీసు విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ -ఆఫీస్ వినియోగాన్నిపెంచి, పరిపాలనలో పారదర్శకత, వేగాన్ని సాధించాలన్నారు. ఈ-ఆఫీస్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలుచేసి, సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఫామాయిల్ తోట దగ్ధం



**నెక్కొండ, మే 12, ప్రభాతవార్త**

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆరు ఎకరాల ఫామాయిల్ తోట దగ్ధమైన సంఘటన మండలంలోని అలంకానిపేట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాదిత రైతు చీకటి రమాదేవి, చీకటి శ్రీనివాస్, చీకటి సతీష్‌లు తెలిపిన వివరాల ప్రకారం 11 కెవి లైన్లు ప్రమాదకరంగా లూజుగా వేలాడుతున్నాయని, వాటిని సరిచేయాలని గత కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు కుటుంబం, స్థానిక రైతులు తెలిపారు. అయితే అధికారులు చేస్తాం, వస్తాం అంటూ కాలయాపన చేసి పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే నేడు ఈ దుర్ఘటన చోటుచేసుకుందని, ఆరు సంవత్సరాల కష్టం, పెట్టుబడి మొత్తం వృధా అయిందని వాపోయారు. అధికారులు వెంటనే సనపందించి పంట నష్టం పది లక్షలు అందించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మరమ్మత్తులు చేపాట్టాలని వారు కోరారు.

# రోడ్డుభద్రత ప్రమాణాలు-మార్గదర్శకాలు పాటించాలి

**- జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా**

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :**



రోడ్డుప్రమాదాల నివారణకు తగినచర్యలు చేపట్టాలని, అలాగే రోడ్డు భద్రత ప్రమాణాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి జిల్లాకలెక్టర్ సందీప్‌కుమార్ ఝా రహదారి భద్రతపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు గల రెండు నేషనల్ హైవేలపై రెండు లేన్‌ల రోడ్డు పనులు వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులచే రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా నేషనల్ హైవేరోడ్‌ల వద్ద ప్రయాణికుల భద్రతకోసం తగుప్రమాణాలను పక్కాగా పాటించాలన్నారు. ప్రధాన రహదారివద్ద వీధివ్యాపారులు తమ వ్యాపారాలను చేసుకోకుండా వారికోసం ప్రత్యేక వెండింగ్ జోన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రహదారులకు ఇరువైపులా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా లైటింగ్ తప్పకుండా ఉండాలన్నారు. ఎక్కువ ప్రమాదాలు సంభవించే ప్రదేశాలవద్ద నెమ్మదిగా వెళ్లుము లాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర చికిత్స ఇచ్చే ఈఎంఆర్ఐ 108సేవలు త్వరగా క్షతగాత్రులకు అందేవిధంగా తగుచర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లాకేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల వద్ద ఉన్న హనుమాన్ ఆలయం దగ్గర రంబుల్‌స్ట్రిప్స్, జీబ్రా పెయింటింగ్ వేయాలన్నారు. అలాగే పాలకుర్తి, వావిలాల క్రాస్‌వద్ద రోడ్‌వెడల్పుకు చర్యలు తీసుకోవాలని, పెంబర్తి యూ టర్న్ వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఆర్‌బీ ఈఈ సరిత, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, ఎక్సైజ్ అధికారి అనిత, డీఎంహెచ్‌ఓ మల్లికార్జున రావు, ఆర్టీఏ మెంబర్ అభి గౌడ్, జనగామ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, నేషనల్ హైవేస్ అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప దేవాలయం హనుమాన్ జయంతి వేడుకలు



**నర్సంపేట, మే 12, ప్రభాతవార్త**

పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలోని అభయాంజనేయ స్వామి దేవాలయం నందు ఆలయ సేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరి కొండ మాధవశంకర్ ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి ఆలయ దాత బొద్దులదివాకర్ నాగరాజు కుటుంబ సభ్యులతో అభయాంజనేయ స్వామి పంచలోహ విగ్రహానికి పూజ నిర్వాహకులు దేవిష్ మిశ్రా బృందం పూజలు ఘనంగా నిర్వహించగా అభిషేకం నూతన వస్త్ర అలంకరణతో నైవేద్యం సమర్పించగా జయంతి వేడుకలు ఆలయ కమిటీ బాధ్యతలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైఫా సురేష్ కోశాధికారి దొడ్డ రవీందర్, చకిలం కృష్ణమూర్తి, బండారుపల్లి చెంచారావు, చిలువేరు వెంకట్రాజ్యం, శింగిరి కొండ రవీందర్, అనంతుల రామనారాయణ, ఆలయ మేనేజర్ దేశము సర్వశం, అభయాంజనేయ స్వామి మాలధార స్వాములు భక్తులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వ్యక్తిగత విబేధాలను పార్టీకి రుద్దడం సమంజసం కాదు..!

**తరిగొప్పుల, మే 12 ప్రభాతవార్త :**



జిల్లా పార్టీ బాధ్యులైనటువంటి జొన్నగొని కిష్టయ్య, అర్జుల సుధాకర్ రెడ్డి వ్యక్తిగత విషయాలను తీసుకొచ్చి పార్టీకి రుద్దుతున్నారని, పార్టీ ప్రతిష్ట దెబ్బతినే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని, అది సరైనపద్ధతి కాదని కాంగ్రెస్‌పార్టీ తరిగొప్పుల మండలఅధికార ప్రతినిధి మెర్గోజు నరహరి అన్నారు. మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరిపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులుపెట్టడాన్ని ఖండిస్తూ గ్రామశాఖ అధ్యక్షుడు పండుగ కనకయ్య అధ్యక్షతన మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరహరి మాట్లాడుతూ జొన్నగోని కిష్టయ్య, అర్జుల సుధాకర్‌రెడ్డిలు పదిసంవత్సరాల నుండి కాంగ్రెస్‌జెండా భుజాన మొశామనడం సిగ్గుచేటని, అది వాళ్ళ విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. వారు అధికారంలో ఏపార్టీ ఉంటే ఆపార్టీలోచేరే నిర్వ్యక్తిత్వం ఉన్న వ్యక్తులన్నారు. అధికారంలో కాంగ్రెస్‌పార్టీ లేనప్పుడు పార్టీకోసం కష్టపడిన నాయకులను కాదని వారికి ఉన్న పరిచయాలతో జిల్లా కమిటీలో పదవులు పొందారని విమర్శించారు. మండలఅధ్యక్షుడు వగలబోయిన యాదగిరివల్లనే కొమ్మూరి ప్రతాపరెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాడని దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని విమర్శించారు. ఓటమి అనేది సహజమని, వ్యక్తిగత విభేదాలను పార్టీకి రుద్దడం సమంజసం కాదన్నారు. పార్టీప్రతిష్టకు భంగం కలిగించే వారు ఎవరైనాసరే వారిపై జిల్లా అధ్యక్షురాలు ధన్వంతీ లక్ష్మీనారాయణ నాయక్, ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి లు తగు కఠినచర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బృంగి శివకుమార్, మండల ఉపాధ్యక్షుడు సిరిగిరి దాసు, మండల కార్యదర్శి చెన్నూరి రామచంద్రం, కార్యవర్గ సభ్యులు గాలి ఐలయ్య, సుంకరి యాదగిరి, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎడ్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు రానీయవద్దు

**- అండగా మేముంటాం**

**జనగామ, మే 12 ప్రభాతవార్త :**





రైతులకు ఎక్కడ ఇబ్బందులు రానీయవద్దని, వారికి అండగా మేముంటామని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ తెలిపారు. మార్కెట్ కమిటీ పత్తియార్డులో నిర్వహిస్తున్న ఐకేపీ సెంటర్, మెప్మా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో వద్ద ధాన్యం పేరుకపోగా చైర్మన్ చొరవ తీసుకుని కలెక్టరేట్‌లో రైతులతో కలిసి కలెక్టర్‌కు విషయం వివరించినట్లు తెలిపారు. మంగళవారం కూడా అధికారులు కొందరు రైతులతో కలిసి లారీ అసోసియేషన్‌లో లారీలకోసం ఆర్టీఓ తో మాట్లాడి లారీలను కేంద్రాలకు, ధాన్యం రైస్‌మిల్లులకు తరలించినట్లు తెలిపారు. అదేవిధంగా కొందరు రైతులకు చెందిన ట్రాక్టర్ల ద్వారా ధాన్యంను మిల్లర్లకు తరలించినట్లు తెలిపారు. ఈసందర్భంగా చైర్మన్ శివరాజ్‌యాదవ్ మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు వచ్చే ప్రతీ రైతుకు మేలు జరిగే ఉద్దేశంతో ప్రతీరోజు సెంటర్ నిర్వాహకులతో, అధికారులతో వివరాలు తెలుసుకుంటూ రైతులకు అండగా ఉంటున్నామని, మార్కెట్ యార్డుకు వచ్చిన రైతులకు మనోధైర్యం కల్పిస్తున్నట్లు తవలిపారు. రైతులు కూడా తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీఓ శ్రీనివాస్‌గౌడ్, మెప్మా పీడీ హర్షవర్ధన్, ఏపీఎం శంకరయ్య, లారీ అసోసియేషన్ నాయకులు జనార్ధన్, శ్రీశైలం, నరేందర్, బాబా, ఆర్‌టీఓ ఎస్ఐ మహేష్, వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌లకు ఆహ్వానం

**నర్మెట, మే 12 ప్రభాతవార్త :**



13న జనగామలో ని ం ్వ ఏ ి ా ం చ ్ ం ని యే ా జ క ్ వ ర్గ స్థా ం ఐ అవగాహన సదస్సుకు నర్మెట మండలంలోని సర్పంచులు హాజరుకావాలని ఎంఈఓ మడిపల్లి ఐలయ్య కోరారు. విద్యావారోత్సవాలపై ఏర్పాటుచేసిన ప్రత్యేక అవగాహన సదస్సు ఆహ్వాన పత్రికలను ఆయా గ్రామాల సర్పంచులకు ప్రత్యక్షంగా అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. నర్మెట సర్పంచ్ గోపగోని శ్రీధర్ గౌడ్‌కు గ్రామపంచాయతీలో ఆహ్వాన పత్రం అందజేశారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరపాలి

## సీఎం రేవంత్ రెడ్డి.





**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాత వార్త.** మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ములుగు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు పాల్గొన్నారు.కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని సీఎం సూచించారు. హమాలీల కొరత లేకుండా స్థానిక కార్మికులను పూర్తిస్థాయిలో వినియోగించాలని, అవసరమైతే ప్రైవేట్ గోదాములు, కమ్యూనిటీ హాళ్లను వినియోగించాలని ఆదేశించారు.రవాణా కోసం ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను వినియోగించాలని, టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 25.78 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతుల చెల్లింపులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ములుగు వార్త

## హౌస్ లిస్టింగ్ పనులు వేగవంతం చేయాలి

### సెన్సస్ జేడీ సుబ్బారాజు.



**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త,మే 12:** ములుగు మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న జనగణన హౌస్ లిస్టింగ్ తొలి విడత పనులను హైదరాబాద్ సెన్సస్ ఆపరేషన్స్ జాయింట్ డైరెక్టర్ సుబ్బారాజు మంగళవారం పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ఇంటి నంబర్ల కేటాయింపు, ˇదిష్టి గుర్తింపు, మ్యాపింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పనుల్లో వేగం పెంచడంతో పాటు ఎలాంటి తప్పులు జరగకుండా చూడాలని మున్సిపాలిటీ అధికారులకు సూచించారు.హౌస్ లిస్టింగ్ బ్లాక్ పరిధిని స్పష్టంగా తెలియజేసేందుకు మూడు రోజుల పాటు మున్సిపాలిటీ సిబ్బందిని ఎన్యూమరేటర్ల వెంట పంపించాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు మే 13 సాయంత్రం లోపు ప్రతి ఇంటికి నంబర్లు పూర్తి చేయాలని సూచించారు. జూన్ 9 వరకు హౌస్ లిస్టింగ్ కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సెన్సస్ ఇంచార్జ్ వినయ్, జిల్లా సెన్సస్ అధికారి ఎం. ప్రకాష్, మున్సిపల్ కమిషనర్ సంపత్, స్టాటిస్టికల్ ఆఫీసర్ బి. లాల్ నాయక్ పాల్గొన్నారు.

# విద్యుత్ పనులు వేగంగా పూర్తి చేయాలి

## .సీఎండీ వరుణ్ రెడ్డి.





**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాత వార్త,** తెలంగాణ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మంగళవారం ములుగు జిల్లాలో కొనసాగుతున్న పలు విద్యుత్ అభివృద్ధి పనులను పరిశీలించారు.ములుగులో నిర్మిస్తున్న డిపార్ట్‌మెంటల్ ఎస్పీఎం షెడ్, పస్రా సెక్షన్ ఆఫీస్ పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రైవేట్ ఎస్పీఎం షెడ్‌ను సందర్శించి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.కర్లపల్లి నుంచి లింగాల సబ్‌స్టేషన్ వరకు నిర్మిస్తున్న 33 కెవి కొత్త లైన్ పనులను కూడా పరిశీలించారు. లింగాల నూతన సబ్‌స్టేషన్‌తో గుండాల, కొడిశెల, లింగాల పరిసర గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో లో వోల్టేజ్, విద్యుత్ అంతరాయాల సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఈ రాజు చౌహాన్, ఎస్ఈ బేతి బిక్షపతి, డీఈ నాగేశ్వర్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

## . జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు.



**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త,** ములుగు జిల్లా కేంద్రంలోని తాత్కాలిక బస్ స్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన బస్ స్టాండ్ ఆవరణ, మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ ప్రకృతి వనం, చలివేంద్రాలను పరిశీలించారు. బస్సుల సమయపాలన, ప్రయాణికుల సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పట్టణ ప్రకృతి వనంలోని మొక్కలకు సమృద్ధిగా నీరు అందించి సంరక్షణ చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జనగాం సంపత్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# సాంస్కృతిక వైభవ ఉత్సవాలకు ఘన ఏర్పాట్లు.

## జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు.





**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త,** ములుగు జిల్లా ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా"ములుగు సాంస్కృతిక వైభవం" ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉత్సవాల షెడ్యూల్, రిజిస్ట్రేషన్, ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం, జెడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల పాఠశాలల్లో మే 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజన నృత్యాలు, ఫుడ్ స్టాల్స్, కవి సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవ వేదికల వద్ద పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల్లో ఎలాంటి లోటు లేకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు సర్పంచులు, కౌన్సిలర్లకు ప్రత్యేక శిక్షణ

**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాత వార్త**

.99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక విద్యా వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు బుధవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, ప్రభుత్వ విద్యా పథకాల అమలులో ప్రజాప్రతినిధుల పాత్రపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు.జిల్లాలోని ప్రజాప్రతినిధులు అందరూ సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

# గురుకుల కళాశాలలో ఇంటర్ కౌన్సిలింగ్

**ప్రభాతవార్త ఏటూర్ నాగారం మే 12**

ములుగు జిల్లా ఏటూర్ నాగారం గిరిజన గురుకుల కళాశాల యందు ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు మే నెల 16, 18 తేదీల్లో కాన్సిలింగ్ నిర్వహించ నట్లు గురుకులాల జిల్లా సమన్వయ అధికారి( డి సి ఓ ) డి. శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏటూరు నాగారం లోని టి.జి టి డబ్ల్యూ ఆర్ జె సి (బాలుర ) కళాశాలలో ఈ నెల 16న ఉదయం 9 గంటలకు బాలురు, టిజిటిబ్ల్యూ ఆర్ సి (బాలికలు) కళాశాలలో ఈ నెల 18 న నిర్వహించే కౌన్సెలింగు బాల బాలికలకు సంబంధిత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, రెండు సెట్లు జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. 20252026 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పాస్ అయినావారు మాత్రమే అర్హులు అని ఆయన తెలిపారు.



# భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం

గోవిందరావుపేట ప్రభాతవార్త



మండలం పరిధిలోని బాలాజీ నగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ మాలోత్ గాంధీ అధ్యక్షతన ప్రజ్వల్ ఎఫ్.పి.సి.ఎల్ ములుగు సంస్థ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు మరియు ల్యాండ్ ప్రిపరేషన్ పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజ్వల్ కార్యకర్త ఆర్ గిరి మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ కు ముందు ప్రతి ఒక్క రైతు తమ భూములలో భూసార పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని తద్వారా రైతులు పంట దిగుబడి పెంచుకొని పెట్టుబడి తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులు పోటీపడి రసాయన ఎరువులను ఎక్కువగా వాడటం వలన నేల యొక్క సారం తగ్గిపోయి భూములు చౌడుబారే అవకాశం ఉంది. కాబట్టి భూసార పరీక్ష చేయించుకుని దాని ఫలితాల ఆధారంగా ఎరువులు వాడడం వలన నేల యొక్క ఆరోగ్యాన్ని కొంతవరకు కాపాడవచ్చు అన్నారు. అలాగే పంట కోసిన తర్వాత నిప్పు పెట్టకుండా దీనివల్ల కలిగే నష్టం గురించి వివరిస్తూ ప్రతి ఒక్క రైతు సేంద్రియ ఎరువులను వాడి భూమిని, భూమి యొక్క ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని రాబోయే తరాల వారికి ఆరోగ్యవంతమైన భూమి ఇవ్వడం కోసం భూసార పరీక్షలు చేయించుకుని తద్వారా వచ్చిన ఫలితాల ఆధారంగానే ఎరువులు వాడి నేలను కాపాడాలని వివరించారు. అందులో భాగంగా రుద్ర బోయిన మల్లేష్ పొలం వద్దకు వెళ్లి మట్టి నమూనా ఎలా తీసుకోవాలని రైతులకు వివరించారు. ఒక ఎకరం చేలలో నాలుగు చోట్ల 6 ఇంచుల వరకు గుంత తీసి అది వీ షేప్ లో తీసి పై మట్టి కింద ఉన్న మట్టి కాకుండా వాటి అంచుల వెంబడి ఉన్న మట్టిని తీసుకుని వాటిని బాగా కలిసే విధంగా చేసి ఒక నమూనాను తీసుకోవాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పియు మేనేజర్ పేర్వాల రాము, సర్పంచ్ మాలోత్ గాంధీ ,వార్డు సభ్యులు అజ్మీర సారయ్య, రైతులు లక్ష్మణ్ భూక్య, మధు నాయక్, లక్ష్మణ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి

భక్తఆంజనేయ దేవాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు.

మహా అన్నదానం.



**మంగపేట మే 12, ప్రభాతవార్త.** శ్రీరాం, ఆంజనేయుని నామస్మరణతో మార్మోగి న ఆలయం కమలాపురం లో ఘనంగా ఇరుముడి కార్యక్రమం మంగపేట మండలం కమలాపురం గ్రామంలో శ్రీ భక్తఆంజనేయ దేవాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను కమలాపురం గ్రామానికి చెందిన కటికనేని ప్రఫుల్ రావు ఆధ్వర్యంలో పంచామృత అభిషేకం, సింధూర లేపనం, హనుమత్ హోమం పూర్ణహుతి ఘనంగానిర్వహిచారు. అనంతరం ఆంజనేయస్వామి దీక్ష పరుల ఇరుముడి ధారణ కార్యక్రమం శ్రీ భక్తంజనేయ అర్చకులు ఈశ్వర్ చందుశర్మ 41 రోజు, 21, 11 రోజుల పాటు కఠోర దీక్షలను చేపట్టిన వారికి అంజన్నస్వామి మాలధారులకు మంత్రోచ్చారణలతో ఇరుముడి కార్యక్రమాన్ని చేపట్టగా కుటుంబ సభ్యులు ఇరుముడి బియ్యం, కట్నాలు సమర్పించారు. స్వాములు ఆలయం చుట్టు ప్రదీక్షణలు చేసి భద్రాచలం సీతారాముల దర్శనానికి బయలుదేరారు. అనంతరం కటికనేని ప్రఫుల్ స్వామి నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు ఈ అన్నప్రసాద వితరణ లో సుమారు ఎనిమిది వందల మంది భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో గురుస్వాములు లింగంపల్లి శ్రీనివాస్ రావు, యాస నాగేందర్ రెడ్డి, కటికనేని ప్రఫుల్ రావు, శ్రీ రాం అశోక్, లక్ష్మణ్, చందు, తాలూకా సంపత్ తోపాటు 50 మంది స్వాములు పాల్గొన్నారు.

# దళిత రత్న పురస్కారం అందుకున్న రామకృష్ణ

సామాజిక సేవలు అభినందనీయం ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు.



**ప్రభాతవార్త ఏటూర్ నాగారం మే 12:** సామాజిక సేవలో తనదైన ముద్ర వేస్తూ, అణగారిన వర్గాల గొంతుకగా నిలుస్తున్న మాల మహానాడు ఆఫ్ ఇండియా ములుగు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శ్రీ కాళ్ల రామకృష్ణ ప్రతిష్టాత్మక దళిత రత్న పురస్కారం లభించింది. ఈ సందర్భంగా హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట శాసనసభ్యులు కే.ఆర్. నాగరాజు రామకృష్ణను ప్రత్యేకంగా అభినందించి, తన చేతుల మీదుగా అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు గారు మాట్లాడుతూ రామకృష్ణ వంటి యువ నాయకులు సామాజిక బాధ్యతతో పనిచేయడం అభినందనీయమని కొనియాడారు. మాల మహానాడు ఆఫ్ ఇండియా ములుగు జిల్లా కమిటీ సభ్యులుగా ఉంటూ, జాతి అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న కృషిని ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తనను ఈ అవార్డుకు ఎంపిక చేయడంలో కీలక పాత్ర పోషించి, వెన్నంటి ప్రోత్సహించిన డాక్టర్ పసుల రామ్మూర్తి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాఅన్నారు . అలాగే తనపై నమ్మకంతో అవార్డును అందజేసిన ఎమ్మెల్యే నాగరాజు , మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. అణగారిన వర్గాల కోసం తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఆఫ్ ఇండియా ములుగు జిల్లా కమిటీ నాయకులు, ఇతర ముఖ్య ప్రతినిధులు పాల్గొని రామకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పోలీస్ లు నిర్వహిస్తున్న క్రీడాలకు అపురూప స్పందన.

మంగపేట మే12, ప్రభాతవార్త.



మంగపేట పోలీస్ లు నిర్వహిస్తున్న క్రీడాలకు అపురూప స్పందన వస్తుందని మంగపేట ఎస్ ఐ టీ వీ ఆర్ సూరి అన్నారు. క్రీడాకారులు ఉత్సహంగా వాలీబాల్ టోర్నమెంట్లో పాల్గొన్నారు. ఫైనలకు బోర్మర్సా పురం ఉత్తమ సమాజాన్ని నిర్మిచేందుకు కలిసినడుద్దాం డ్రగ్ లేని సమాజం నిర్మాణం అనే నినాదంతో ములుగు జుల్లా వ్యాప్తంగా పోలీస్ లు నిర్వహిస్తున్న క్రీడాలకు అపురూప స్పందన వచ్చింది. పోలీస్ లచే నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ లకు మంగపేట యువత ఉత్సహంగా పాల్గొన్నారు. మొత్తం 15 టీమ్ లు రాగా మంగళవారం జరిగిన మ్యాచ్ లో బోరనర్సా పురం బాలన్నగూడెం సెమిస్ ఆడగా బోరనర్సా పురం ఫైనల్ వచ్చింది నేడు బోరనర్సా పురం 2 టీమ్, కొత్తపేట ఎస్ టి టీమ్ కు సెమిస్ ఉంటాయి. ఫైనల్ మ్యాచ్ నేడు ఉంటుందని తెలిపారు

# భక్తిశ్రద్ధల మధ్య ముగిసిన హనుమాన్ దీక్షలు

గోవిందరావుపేట ప్రభాతవార్త. **మండలంలో 41 రోజుల పాటు కఠోర** నియమాలతో కొనసాగిన, భక్తిశ్రద్ధల మధ్య హనుమాన్ దీక్షలు మంగళవారం సంపూర్ణంగా ముగిశాయి. దీక్షా విరమణ అనంతరం భక్తులు సామూహికంగా భద్రాచలం, కొండగట్టు అంజన్న క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. పసర, మెద్దుల గూడెం, గోవిందరావుపేట, భూసాపూర్, దుంపెల్లి గూడెం చల్వాయి, గ్రామాలలో హనుమాన్ భక్తులు తెల్లవారుజామున 4 గంటలకు హనుమాన్ ఆలయాలలో వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు దీక్షాపరులకు తీర్థప్రసాదాలు అందించి, యాత్ర నిర్విఘ్నంగా సాగాలని ఆశీర్వదించారు. సుమారు350 మంది భక్తులు కాషాయ వస్త్రాలు, కంఠంలో మాలలు, చేతిలో కాషాయ జెండాలతో బయలుదేరారు. "జై శ్రీరామ్, జై హనుమాన్" నినాదాలతో, వీధులు మార్మోగాయి. మార్గమధ్యలో పలు గ్రామాల ప్రజలు భక్తులకు మజ్జిగ, పండ్లు, అల్పాహారం అందించి సేవ చేశారు. దీక్షా సమయంలో ఉపవాసాలు, బ్రహ్మచర్యం, నేలపై నిద్ర వంటి నియమాలను భక్తులు కచ్చితంగా పాటించారు. కొండగట్టు అంజన్న సన్నిధిలో ఇరుముడి సమర్పించి, మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది. భక్త బృందానికి స్థానిక యువజన సంఘాలు, పోలీసులు తగిన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 156 కి.మీ దూరాన్ని రెండు రోజుల్లో కాలినడకన చేరుకోవాలని భక్తులు లక్ష్యంగా పెట్టుకున్నారు. గత 12 ఏళ్లుగా మండలం నుండి కొండగట్టుకు సామూహిక యాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రేపు సాయంత్రానికి భక్తుల బృందం కొండగట్టు చేరుకుని స్వామివారి దర్శనం చేసుకోనుంది.

## ఏటూర్‌నాగారం వార్త

# సేవా గుణంతో ఆదర్శంగా నిలిచిన పస్రా ఎస్.ఐ

గోవిందరావుపేట ప్రభాతవార్త.



మండలంలోనిమునిగాల సామ్రాజ్యం భర్త వెంకటస్వామి కొంతకాలం క్రితం మృతి చెందడంతో ఆమె ఒంటరిగా మిగిలిపోయింది. 25 ఏళ్ల సామ్రాజ్యం కుటుంబ పోషణ కోసం కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నది. ఈ విషయం తెలుసు కున్న ఎస్ఐ తాజుద్దీన్ వెంటనే స్పందించారు. పెద్దమనసుతో సామ్రాజ్యానికి ఆర్థిక సాయం అందించి ఆమెకు అండగా నిలిచారు. కష్టకాలంలో తనకు అండగా నిలిచిన ఎస్ఐకి సామ్రాజ్యం కన్నీటితో కృతజ్ఞతలు తెలిపింది. పోలీసులు కేవలం శాంతిభద్రతల పరిరక్షణే కాకుండా సమాజ సేవలోనూ ముందుంటారని ఈ ఘటన మరోసారి రుజువు చేసింది. ఎస్ఐ తాజుద్దీన్ సేవాగుణాన్ని స్థానికులు ప్రశంసించారు. పోలీస్ శాఖలో ఇలాంటి మానవతా దృక్పథం గల అధికారులు ఉండడం గర్వకారణమని గోవిందరావుపేట గ్రామస్థులు పేర్కొన్నారు.

# టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

వెంకటాపూర్, (రామప్ప) ప్రభాతవార్త ::



ఈనెల 15న ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ జిల్లా మహాసభ సందర్భంగా వెంకటాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా అధ్యక్షులు మహమ్మద్ షఫీ మాట్లాడుతూ.. జిల్లా మహాసభను విజయవంతం చేయాలని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బేతి సతీష్, ఒద్దుల మురళి, ఆలుగొండ రమేష్, పోశాల చంద్రమొగిలి, మునిగాల రాజు, ఆకుల రామకృష్ణ, బానోత్ యోగి, దేశిని వినీల్, మామిడిశెట్టి ధర్మతేజ, ఎండి రఫీ, తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయంను సందర్శించిన నూతన కలెక్టర్



**వెంకటాపూర్ (రామప్ప) ప్రభాతవార్త ::** మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని మంగళవారం ములుగు జిల్లా నూతన కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సందర్శించారు. వారికి ఆలయ కార్యనిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్, ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ మండపంలో ఈవో భాస్కర్ శాలువాలతో సన్మానించగా పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు ఆలయ చరిత్ర శిల్పకళా ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వివరించారు. వారి వెంట తహసిల్దార్ గిరిబాబు, సర్పంచ్ చల్లగోండ రాజు, ఆర్ ఐ రమేష్, టూరిస్ట్ పోలీస్ శ్రీనివాస్, రెవెన్యూ, దేవాదాయ టూరిజం పురావస్తు శాఖల సిబ్బంది ఉన్నారు.

## ప్రమాదకరంగా మారిన మర్రిపల్లిగూడెం

కమలాపూర్: ప్రభాతవార్త.

కమలాపూర్ మండలంలోని మర్రిపల్లిగూడెం నుంచి గుండేడు వరకు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా విచ్చలవిడిగా పెరిగిన చెట్లు, పొదలతో వాహనదారుల ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు ఒకవైపు ఎస్సారెస్పీ కెనాల్, మరోవైపు దట్టంగా పెరిగిన తుమ్మచెట్లతో ఆనుకొని ఉండటంతో రాకపోకలు సాగించే వారికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు భయపడే పరిస్థితి నెలకొంది. కొద్దిగా పక్కకు తిరిగితే కెనాల్ లోకి పడే ప్రమాదం ఉండటంతో వాహనాల వేగం మందగిస్తోంది. మర్రిపల్లిగూడెం, గుండేడు, లక్ష్మాజీపల్లి గ్రామాలను కలిపే ప్రధాన రహదారి ఇదే కావడం గమనార్హం. రోజు వందలాది మంది విద్యార్థులు, కూలీలు, రైతులు, ఉద్యోగులు ఈ దారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. అయినప్పటికీ రోడ్డు నిర్వహణ, మరమ్మత్తుల విషయంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాలకులకు కూడా ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదని మండిపడుతున్నారు. "ఏదైనా పెను ప్రమాదం జరిగితే కానీ మీకు కళ్ళు తెరుచుకోవా? ప్రజల ప్రాణాలు అంత చవకా?" అంటూ గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని, రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న చెట్లు, పొదలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.




## ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 15న ఇంటర్వ్యూ లు

భీమదేవరపల్లి: మే 12 (ప్రభాతవార్త)

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ 202526 ఆర్థిక సంవత్సరానికి గాను దరఖాస్తులు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో వీరేశం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఎలక్ట్రికల్ టూ వీలర్, త్రీ వీలర్ వాహనాల, రెండు గేదెల కొరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 15 తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయని తెలిపారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ సర్టిఫికెట్ల తో హాజరుకావాలని సూచించారు.




## టిపిసిసి అధ్యక్షునికి ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు

పరకాల మే 12 (ప్రభాత వార్త )



టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ స్వాగతం పలికారు. మంగళవారం బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పరకాల నియోజకవర్గ పరిధిలోని దామెర మండలం ముస్త్యాలపల్లి గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం ప్రతి స్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ఆయనకు ఒగ్లాపూర్ చౌరస్తాలో పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బండి శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు బండి సదానందం గౌడ్, పసుల రమేష్, మార్క రఘుపతి గౌడ్, ఏకు రాజు, ఎన్ ఎస్ యు ఐ జాతీయ కోఆర్డినేటర్ మార్క అభినవ్ గౌడ్, మునిగంటి విష్ణువర్ధన్, బొచ్చు జెమిని తదితరులు పాల్గొన్నారు.

## నర్సుల సేవలు వెలకట్టలేనివి

పరకాల మే 12 (ప్రభాత వార్త )



అంకితభావంతో పని చేస్తున్న నర్సుల సేవలు వెలకట్టలేనివని పరకాల ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహాన్ అన్నారు. పట్టణంలోని దవాఖానలో నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు దివంగత ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతమ్ చౌహాన్ మాట్లాడుతూ ఆత్మస్థైర్యంతో రోగులకు సేవలు అందిస్తున్న నర్సులు అభినందనీయులన్నారు. కరోనా వంటి ప్రాణాంతక వ్యాధి బారిన పడిన ప్రజలకు ఎంతో ధైర్యంగా, తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా నర్సులు సేవలు అందించారని గుర్తుచేశారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందేవారు, ప్రమాదాల్లో గాయాలపాలైన క్షతగాత్రులు, ప్రసూతి వైద్య సేవలకు వచ్చే గర్భిణులను తన తోబుట్టువులుగా భావించి సేవలందించే నర్సులు తల్లితో సమానమైన గౌరవాన్ని పొందుతున్నారని తెలిపారు. అచేతన స్థితిలో ఉన్న బాధితులకు సేవలు అందించే నర్సింగ్ వృత్తి పవిత్రమైనదన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి వైద్య సేవలు అందించి పునర్జన్మను ప్రసాదించే నర్సుల పాత్రం ఎంతో ముఖ్యమన్నారు. బాధితులకు వైద్యంతోపాటు మానవత్వం, ఆప్యాయతతో అందించే సేవలు సైతం ఔషధాలుగా పని చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బాలకృష్ణ, మహేష్, హారిక, సంగీత, నర్సింగ్ సూపరింటెండెంట్ రమాదేవి, హెడ్ నర్సులు నాగమణి, ప్రసన్న, శారద, జ్యోతి, రజని, స్టాఫ్ నర్స్ లు భాగ్యలక్ష్మి, స్వాతి, సుప్రజ, సునీత, సుమలత, సుధా, రాణి తదితరులు పాల్గొన్నారు

## రైల్వే మిక్స్ హై స్కూల్,పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

,కాజీపేట్ మండల్ మే12(ప్రభాతవార్త)



పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకుని, పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా సమయం గడిపే సామాజిక సమావేశం. ఇది ఆత్మీయ సమ్మేళనం,గా పిలవబడుతుంది. ఎన్నాళ్ళైందో కలుసుకుని"పాత రోజులు గుర్తొస్తున్నాయి"చాలా ఆనందంగా ఉంది"రైల్వే మిక్స్ హై స్కూల్, 1991 బ్యాచ్, 10వ బి సెక్షన్ వారమైనందుకు, గర్విస్తున్నాము. 35 సుదీర్ఘ సంవత్సరాల తర్వాత, స్నేహితులందరూ 2026 మే 10వ తేదీన కాజీపేటలోని ఫాతిమానగర్లో ఉన్న వైష్ణవి కన్వెన్షనల్ హాల్లో మరోసారి కలుసుకున్నారు. ఇది ఆనందం, నవ్వులు, జ్ఞాపకాలు స్నేహంతో నిండిన ఒక అందమైన భావోద్వేగభరితమైన పునఃసమావేశం. స్నేహితులైన డాక్టర్ భాగ్య, సునీత, రాణి, షమీమ్, జాన్, రామకృష్ణ, వినోద్, జమీర్ మరెందరో అందించిన మద్దతు, వ్యాఖ్యానం, సమన్వయం చురుకైన భాగస్వామ్యం వల్ల ఈ అద్భుతమైన కలయిక ఘనవిజయం సాధించింది. ఇన్ని సంవత్సరాల తర్వాత సహపాఠులను కలవడం, నిజమైన స్నేహం కాలంతో పాటు ఎప్పటికీ మసకబారదని మాకు గుర్తుచేసింది. ఈపునఃసమావేశాన్ని చిరస్మరణీయంగా మరవపురానిది. 35 ఏళ్ల తర్వాత కూడా పూర్వ విద్యార్థులు, స్నేహితులు ఒకచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆత్మీయంగా కలుసుకోవడం ఇందులో ఎంతో ప్రత్యేకం ఉంది అన్నారు

## భద్రకాళి దేవాలయం సందర్శించిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తిరుమలాదేవి

మే 12, (ప్రభాతవార్త, హనుమకొండ టౌన్



:వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన భద్రకాళీ దేవస్థానమును మంగళవారం మధ్యాహ్నం తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తిరుమలాదేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన తిరుమలా దేవి కి ఆలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఒరుగంటి పూర్ణచందర్, మయూరి రామేశ్వర్రావు, సిరివోలు శ్రీధర్రావు మరియు ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యవమున అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పర్యవేక్షకులు విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. దేవాలయములో మంగళవారం హనుమాన్ జన్మోత్సవం వైభవంగా నిర్వహించబడినది. భద్రకాళి దేవాలయ దత్తత దేవాలయమైన శ్రీ చెరువులో ఆంజనేయస్వామి దేవాలయములో హనుమాన్ జయంతి ఉత్సవములు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అభిషేకములు నిర్వహించిన తదుపరి హోమము నిర్వహించి అనంతరం అన్నదానం నిర్వహించుట జరిగినది. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## ఘనంగా హనుమాన్ జయంతి ఆలయాల్లో భక్తుల సందడి

### దేవాలయాల్లో దీక్షాపరుల మాల విరమణ

పరకాల మే 12 ( ప్రభాత వార్త )

పట్టణంలోని భవాని సహిత కుంకుమేశ్వర స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం విఘ్నేశ్వర పూజతో వేడుకలకు అంకురార్పణ చేశారు. ఆలయ పూజారులు కోమల పెల్లి నాగభూషణ శర్మ ఆధ్వర్యంలో రుద్ర సూక్తము, ఫల పంచామృతాలు, 14రకాల ద్రవ్యాలతో స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం రుద్ర హవనము, మన్యసూక్త హోమాలు చేపట్టారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి సహస్రనాగవల్లి సహిత సహస్రనామార్చన తమలపాకులతో నిర్వహించారు. అర్చకులు కోమలపల్లి సంపత్ కుమార్ శర్మ, వినయ్ కుమార్ శర్మ స్వామివారి మూలవిరాట్టుకు అర్చనలు, ప్రత్యేకాభిషేకాలు చేశారు. దేవాలయంలో దీక్షాపరులు మాలవిరమణ చేశారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో హనుమాన్ మాల దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

## హాజ్ యాత్రకు బయలుదేరిన ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులుజండా ఊపి యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని

మే 12, ప్రభాతవార్త, హనుమకొండ టౌన్ :



హైదరాబాద్లోని హాజ్ హౌస్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పవిత్ర హజ్ యాత్రకు బయలుదేరిన భక్తులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి జెండా ఊపి యాత్రను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హజ్ యాత్రకు వెళ్తున్న భక్తులతో ప్రత్యేకంగా మాట్లాడి, వారి యాత్ర సుఖసంతోషాలతో విజయవంతంగా పూర్తికావాలని ఆకాంక్షించారు. దేశంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని ప్రార్థించాలని భక్తులను కోరారు. హజ్ యాత్ర ముస్లిం సోదరుల జీవితంలో అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక ప్రయాణమని పేర్కొన్న ఎమ్మెల్యే, భక్తులు క్షేమంగా వెళ్లి సురక్షితంగా తిరిగి రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ చైర్మన్,పీఠాధిపతి కుసురు పాషా, అజ్మతుల్ల, అబుబకర్, ముస్లిం మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, హజ్ కమిటీ సభ్యులు, భక్తుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# మాజీ కార్పొరేటర్ దంపతులకు ఆత్మీయ వీడుకోలు

### ఘనంగా సన్మానించిన 32,33 డివిజన్ ప్రజలు

వరంగల్ మే 12 ప్రభాతవార్త





గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 33వ డివిజన్ కార్పొరేటర్ గా ముష్కమళ్ళ అరుణ సుధాకర్ లు ఐదేళ్ళు పూర్తి చేసుకుని పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా పక్క పక్కనే కలిసి ఉన్నా 32, 33 డివిజన్ ప్రజలు, కార్యకర్తలు, దుర్గా మల్లేశ్వర స్వామి శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయాల కమిటీ, దుర్గా సేవా సంఘం సభ్యులు మంగళవారం సన్మానించారు. అనంతరం కార్పొరేటర్ దంపతులు మాట్లాడుతూ డివిజన్లో అభివృద్ధి పనులు డివిజన్ ప్రజలతో ఒక కుటుంబ సభ్యుడి మాదిరిగా కలిసే అవకాశం కల్పించారు. ఒక కొడుకుగా ఒక అన్నగా తమ్ముడిగా ప్రజలకు అందుబాటులో ఉంటూ డివిజన్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నిరంతరం ప్రజలతో కలివిడిగా ఉంటూ ఎంతో ఆనందాన్ని పొందాము. ప్రజలను ఎంతో ఆప్యాయంగా పలకరించే మాకు డివిజన్ ప్రజల ప్రేమ అభిమానులు సంపాదించు కున్నాము. రెండు డివిజన్ ప్రజలకు కార్యకర్తలకు సన్నిహితులకు ఎల్లవేళలా రుణపడి ఉంటామని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో దుర్గా మల్లేశ్వర స్వామి, వీరాంజనేయ స్వామి దేవాలయాల కమిటీ శాశ్వత ధర్మకర్తలు ఆకారపు శశిధర్, శ్రీ దుర్గా సేవా సంఘం అధ్యక్షులు పోరండ్ల ఓం ప్రకాష్, సిరంగి రాజారామ్ తోట బొడ్రాయి కమిటీ ప్రధాన కార్యదర్శి చిలువేలు రవీందర్, సిరంగి రాజారాం తోట డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షులు పరదేశి రాజేష్, శ్రీ దుర్గా సేవా సంఘం సహాయ కార్యదర్శి చిలువేరు రాజేందర్, శ్రీరాముల బిక్షపతి, మనం శ్యామ్, అల్వ దాసు మధు, బుదారం కన్ని, పాసికంటి రాజు, గౌడ సందీప్, ఆడెపు జగన్, శ్రీ కాళోజీ గ్రంథాలయ వ్యవస్థాపక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గౌడ యువజన సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కత్తి చిరంజీవి

వర్ధన్నపేట/మే 12 ప్రభాత వార్త



తెలంగాణ గౌడ యువజన సంఘం వరంగల్ జిల్లా నూతన అధ్యక్షుడిగా వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామానికి చెందిన కత్తి చిరంజీవి నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు నరేష్ గౌడ్ అధికారిక నియామక పత్రాన్ని జారీ చేశారు.గౌడ యువతను సంఘటితం చేయడంలో చిరంజీవి గౌడ్ చూపుతున్న చొరవ, నిబద్ధతను గుర్తించి రాష్ట్ర కమిటీ ఈ బాధ్యతలను అప్పగించిందని జిల్లాలో సంఘం బలోపేతానికి, కుల బాంధవుల సమస్యల పరిష్కారానికి ఆయన నాయకత్వం దోహదపడుతుందని రాష్ట్ర కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కత్తి చిరంజీవి గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు గట్టు నరేష్ గౌడ్ కు , రాష్ట్ర కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అతి త్వరలోనే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉత్సాహవంతులైన గౌడ యువకులతో పూర్తిస్థాయి జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తామని , జిల్లాలోని గీత కార్మికులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలపై, అలాగే గౌడ జాతి హక్కుల సాధన కోసం క్షేత్రస్థాయిలో పోరాడుతానని , ప్రతి గ్రామంలో గౌడ యువతను ఒక్కతాటిపైకి తెచ్చి, వారిని సామాజికంగా , రాజకీయంగా చైతన్యపరుస్తామని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు, జిల్లా కుల బాంధవులకు, మిత్రులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రశాంతంగా టీజీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష

ఎడ్యుకేషన్ కేయూ, మే 12 ప్రభాతవార్త :



టీజీ ఎడ్‌సెట్-2026 ప్రవేశపరీక్ష రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. తెలంగాణ రాష్ట్రంలోని బి.ఎడ్. కోర్సుల్లో 2026-27 విద్యాసంవత్సర ప్రవేశాలకోసం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన టీజీ ఎడ్‌సెట్-2026 ప్రవేశపరీక్ష మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా రెండు సెషన్‌లలో ప్రశాంతంగా ముగిసినట్లు కన్వీనర్ ఆచార్య బి.వెంకట్రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డితో కలిసి ప్రశ్నాపత్రం (సెట్)ను ఎంపికచేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 35,600మంది అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, వారిలో 29,342మంది పరీక్షకు హాజరయ్యారు. ఈ మేరకు మొత్తం హాజరుశాతం 82గా నమోదైంది. టీజీసీహెచ్ఇ-వైస్‌చైర్మన్ ఆచార్య పురుషోత్తం, సెక్రటరీ ఆచార్య శ్రీరామ్ వెంకటేశ్, కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, విద్యా విభాగ డీన్ ఆచార్య ఎన్.రామనాథ కిషన్, డీన్లు ఆచార్య బి.సురేష్ లాల్, ఆచార్య జి.హనుమంత్, ఆచార్య రాజేందర్‌కట్ల, విద్యాకళాశాల ప్రిన్సిపాల్ డా.నల్లాని శ్రీనివాస్‌తో పాటు టీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. చైర్మన్ ఆచార్య వి.బాలకిష్టా రెడ్డి, వైస్‌చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, కన్వీనర్ ఆచార్య బి.వెంకట్రామరెడ్డి నగరంలోని పలుకేంద్రాలు సందర్శించారు.

## భూసార పరిరక్షణకు గ్రామ కమిటీలు చురుగ్గా పనిచేయాలి

### ధరిత్రి మాతా బచావో' కమిటీలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద దిశానిర్దేశం

గీసుగొండ, మే 12 ప్రభాతవార్త



భూసారాన్ని కాపాడుతూ సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన గ్రామ స్థాయి 'ధర్తీ మాతా బచావో' కమిటీలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. గీసుగొండ మండలం మొగిలిచర్ల రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన కమిటీ సభ్యుల అవగాహన సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె మార్గనిర్దేశం చేశారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూమి ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో ఈ కమిటీల పాత్ర కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, కృషి సఖిలు, డ్రోన్ దీదీలు సమన్వయంతో రైతులను సేంద్రియ సాగు వైపు మళ్లించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రోన్ సాంకేతికత వంటి ఆధునిక పద్ధతుల ద్వారా ఎరువుల వినియోగంలో సమతుల్యత పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎరువుల సరఫరా, పంపిణీపై గ్రామ స్థాయి కమిటీలు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. త్వరలో గ్రామ సభలు నిర్వహించి భూసార పరిరక్షణకు సంబంధించిన తీర్మానాలను జిల్లా కమిటీకి పంపించాలని సూచించారు. పి. హరి ప్రసాద్ బాబు, తహసీల్దార్ ఎం.డి. రియాజుద్దీన్ మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామంలో భూసార పరీక్షలు, జీవ నియంత్రణ మందుల వినియోగం, సమతుల్య ఎరువుల వాడకంపై ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బొడ్డుచిం తలపల్లి సర్పంచ్ పి. వనిత యుగంధర్, డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధి బూసాని వేణుగోపాల్ నిగరాణి సమితి సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. సమావేశానికి గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, ప్యాక్స్ డైరెక్టర్లు, పాల్గొన్నారు.

## ఆచార్య వెంకటనారాయణకు ఎన్‌జీవోస్ సంఘంచే ఘనసన్మానం

ఎడ్యుకేషన్ కేయూ, మే 12 ప్రభాతవార్త :

తెలుగు అకాడమీ చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకటనారాయణకు కేయూ ఎన్‌జీవోస్ సంఘం ఘనసన్మానం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్‌గా నియమితులైన కాకతీయ విశ్వ విద్యాలయ విశ్రాంత ఆచార్యులు ఆచార్య కూరపాటి వెంకటనారాయణను కేయూ ఎన్‌జీవోస్ అసోసియేషన్ నాయకులు మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆచార్య కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఎన్‌జీవో ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కేయూ ఎన్‌జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు బూర నవీన్‌కుమార్, తదితరులున్నారు.

# వరంగల్ వార్త

## ఇల్లందలో మృతురాలి కుటుంబానికి బీజేపీ నాయకుల పరామర్శ

### బియ్యం,ఆర్థిక సాయం అందజేత

వర్ధన్నపేట/మే 12 ప్రభాత వార్త



ఇల్లంద గ్రామంలో ఇటీవల మృతి చెందిన చెన్న నాగమ్మ (భర్త సమ్మయ్య) కుటుంబాన్ని బీజేపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాధితులకు బీజేపీ మండల అధ్యక్షుడు అడుప రాజు, ఊట్ల పెద్దిరెడ్డి, ముద్దరబోయిన రాంప్రసాద్ సంయుక్తంగా ఒక క్వింటా బియ్యాన్ని అందించారు అదేవిధంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ తమ వంతు సాయంగా రూ. 2,000 నగదును వారికి పంపించగా వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు నాంపెల్లి యాకయ్య, బీజేపీ శక్తి కేంద్రం ఇంచార్జ్ సట్ల అనిల్ గౌడ్, కన్నెబోయిన దుర్గయ్య, సుంకరి బాబు, తాల్లపెల్లి శ్రీధర్, సాతుపెల్లి శంకర్, మూల రాము, తాండ్ర హరీష్, మల్లెపాక రాకేష్, చిన్నపెల్లి శ్రీకాంత్, మచ్చ రాము, వేల్పుల అభి తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ ఇంటర్నేషనల్ వరంగల్ జిల్లా చైర్‌పర్సన్‌గా గట్ల శ్రీనివాస్

### జిల్లా డైరెక్టర్‌గా పసుల శివనారాయణ నియామకం

### గీసుగొండ నేతలకు కీలక బాధ్యతలు అప్పగించిన ఇంటర్నేషనల్ వాకర్ అసోసియేషన్ 303 గవర్నర్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్

గీసుగొండ, మే 12 ప్రభాతవార్త.



సామాజిక సేవలో అంకితభావంతో పనిచేస్తున్న గీసుగొండ ప్రాంత నేతలకు వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 303 లో కీలక బాధ్యతలు దక్కాయి. గట్ల శ్రీనివాస్‌ను వాకర్స్ ఇంటర్నేషనల్ వరంగల్ జిల్లా చైర్‌పర్సన్‌గా, పసుల శివనారాయణను వరంగల్ జిల్లా డైరెక్టర్‌గా నియమిస్తూ ఇంటర్నేషనల్ వాకర్ అసోసియేషన్ 303 గవర్నర్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలు 2026 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా వాకర్స్ కార్యకలాపాల నిర్వహణ, విస్తరణకు సంబంధించిన పూర్తి బాధ్యతలు ఈ ఇద్దరికీ అప్పగించినట్లు గవర్నర్ పేర్కొన్నారు. ప్రజాసేవలో గట్ల శ్రీనివాస్, పసుల శివనారాయణ చూపిన నిబద్ధత, నాయకత్వ లక్షణాలు, ఆరోగ్య చైతన్యం కోసం చేస్తున్న కృషిని గుర్తించి ఈ పదవులు ఇచ్చినట్లు డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ వివరించారు. "ఆరోగ్యమే మహాభాగ్యం - నడకతోనే ఆరోగ్యం" అనే నినాదంతో సంస్థ సేవలను ప్రతి గ్రామానికి తీసుకెళ్తామని వాకర్స్ ఇంటర్నేషనల్ వరంగల్ జిల్లా చైర్‌పర్సన్ గట్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ నియామకాలపై వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ 303 గవర్నర్ నిర్ణయాన్ని స్వాగతించారు. గట్ల శ్రీనివాస్, పసుల శివనారాయణలకు అభినందనలు వెల్లువెత్తాయి.

# జిల్లా కలెక్టర్ వైఖరి మార్చుకోవాలి..!

## - జిల్లా అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం





**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :**

జనగామ జిల్లా కలెక్టర్ రోజురోజుకు నియంతృత్వ పోకడలతో అందరిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆయన తన వైఖరి మార్చుకోవాలని కోరుతూ జిల్లా అఖిలపక్షం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. మంగళవారం జనగామ పట్టణంలోని విజయ ఫంక్షన్‌హాల్‌లో జనగామ జిల్లా పార్టీలు, ప్రజాసంఘాలు సంయుక్తంగా జిల్లా కలెక్టర్ నియంతృత్వ వైఖరిపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కులవివక్షత వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో జనగామలోని కార్మిక, కర్షక లారీ, ట్రాక్టర్, భవన నిర్మాణ కాంట్రాక్టర్లు, మాజీ, ప్రస్తుత కౌన్సిలర్‌లు పాల్గొని కలెక్టర్ వ్యవహారశైలిని తప్పు పట్టారు. ఈ సందర్భంగా వనితా టీస్టాల్ నడుపుతున్న దళిత మహిళ పాలమాకుల మంజుల తన టీస్టాల్‌ను ఎటువంటి కనికరం లేకుండ తొలగించి తన జీవనభృతిని ఏవిధంగా ధ్వంసం చేశాడో చెబుతూ కన్నీరుపెట్టుకుంది. మాజీ కౌన్సిలర్ కత్తుల రాజిరెడ్డి మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుండి వ్యవసాయశాఖ నుండి 17లక్షల బకాయిలు రావాల్సి ఉండగా వాటి విషయంలో జిల్లా కోర్ట్ వ్యవసాయశాఖ కార్యాలయం జప్తు చేయమని ఆదేశాలు జారీచేయగా అట్టి ఆదేశానుసారము కోర్టు సిబ్బంది జిల్లా వ్యవసాయ కార్యాలయమును సందర్శించినప్పుడు కలెక్టర్ అడ్డుకొని వారిని కోప్పడి తన కార్యాలయంలో జప్తులు చేయవద్దని వారిని దూషించి పంపారని, ఈ విషయమై హైకోర్టులో కేసు విచారణలో వుందని రాజిరెడ్డి తెలిపారు. ఐతే ఈవిషయాన్ని దృష్టిలోపెట్టుకొని వ్యక్తిగతంగా తనపై కక్షపెంచుకొని ఆర్‌డిఓ అధ్యక్షతన తన వ్యాపారాన్ని మూయించడానికి ఎనిమిది ప్రభుత్వశాఖల ద్వారా విచారణ చేయిస్తున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు.

**- కాంగ్రెస్ కార్యకర్తనైనా ఏమీచేయలేకపోతున్నా..:**

ట్రాక్టర్ల యజమానుల సంఘం జిల్లా నాయకుడు ఆకుల లక్ష్మయ్య మాట్లాడుతూ భవన కార్మికులకు ముఖ్యంగా ఇసుక అవసరమని అయితే లారీలద్వారా పెద్దమొత్తంలో ఇసుక లభిస్తుందని తక్కువ మొత్తం కావలసిన యజమానులు ట్రాక్టర్ల ద్వారా లారీలనుండి తోడుకొని సరఫరా చేస్తారని ఈ విధానాన్ని తప్పుపట్టి జిల్లా కలెక్టర్ లక్షలరూపాయల జరిమానావేసి ట్రాక్టర్ యజమానులను, డ్రైవర్లను ఉపాదిలేకుండా ఉపవాసాలు పడుకోబెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి కూడా సరఫరా చేయకుండా లక్షలరూపాయలు జరిమానాలు వేస్తున్నాడని, అనేక నిబంధనలు పెట్టి అసలు భవన నిర్మాణాలు కుంటుపడేలా వ్యవహరిస్తున్నాడని ఇలా చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి నష్టం జరుగుతుందని, తాను కాంగ్రెస్ కార్యకర్తనై ఉండికూడా ఏమి చేయలేక పోతున్నానని వాపోయారు.

**- కలెక్టర్ వ్యవహారశైలితో ప్రజలు నష్టపోతున్నారు..:**

సాధిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ మాట్లాడుతూ పోరాడి తెచ్చుకున్న జిల్లాలో ప్రజలందరు జిల్లా కలెక్టర్ వ్యవహారశైలి వల్ల నష్ట పోతున్నారని, కాంగ్రెస్ నాయకులు చూస్తూ కూర్చోవడంవల్ల వారు ఇక ఎప్పుడు జిల్లాలో ఓట్లు అడిగే అర్హతను కోల్పోతారన్నారు. బీహార్‌కు చెందిన ఐఏఎస్ ఆఫీసర్లను గత ప్రభుత్వంలో ఈ తెలంగాణకు పట్టిన చీడగా వర్ణించిన ఈ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ఈ కలెక్టర్‌ను జనగామ ప్రజలను హింసించడానికి పంపడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. జిల్లా ప్రజలు ఏకమై ఈ కలెక్టర్ వ్యవహారంపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నారని అన్నిపార్టీల వారు కలిసివస్తే వారికి పుట్టగతులు ఉంటాయని, లేకుంటే జనగామ ప్రజలు కలెక్టర్‌ను పంపే ప్రక్రియలో కలిసిరాని పార్టీలను సమాధి చేస్తారని ఆయన తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా కళ్లుతెరచి జనగామ ప్రజలను వేధిస్తున్న జిల్లా కలెక్టర్‌ను బదిలీ చేయించాలని లేకుంటే వారే ప్రజలకు సమాధానము చెప్పుకోవలసి ఉంటుందన్నారు.

విజయ డైరీ పార్లర్ పెట్టుకున్న విజయలక్ష్మీ మాట్లాడుతూ తనస్టాల్ ను కూడా జిల్లా కలెక్టర్ ఎటువంటి కనికరం లేకుండా తీసి వేసాడని ఆవేదన వ్యక్తంచేశారు. ఆటో ట్రాన్స్‌పోర్టు సంఘం నాయకులు గొంగళ్ల రామక్రిష్ణ మాట్లాడుతు ఇసుక తక్కువ మొత్తంలో సరఫరాచేసే తమకు ఉపాధిలేకుండా జిల్లా కలెక్టర్ చేయడం వల్ల వందలాది మంది తన వంటి ఆటోట్రాలీ కార్మికులు రోడ్డున పడ్డారని తమ బ్రతుకు వెళ్ళబుచ్చడం కష్టంగా మారిందని ఆందోళన వెలిబుచ్చారు. న్యాయవాది రాగళ్ల శ్రీహరి మాట్లాడుతూ తాము కేసులు వాదించడానికి కలెక్టరేట్‌కు వెళితే తమ వాహనాలను ఒక కిలోమీటర్ దూరంలోనే ఆపి మండుటెండలో నడుచుకుంటూ రావాలని ఆదేశాలు జారీచేసిన జిల్లా కలెక్టర్ పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ చివరకు పత్రికా ప్రతినిధులను కూడా వదిలిపెట్టకుండా హింసిస్తున్నాడని, వరంగల్ నుండి ఎవరోవ్యక్తిని తెచ్చి అక్రిడియేషన్ కమిటిలోవేసి పత్రికా విలేఖరులను చులకన చేస్తున్నాడని, వారి వాహనాలను కూడా జిల్లా కలెక్టర్ కార్యాలయంకు రాకుండా నిరోదించి వారిని తీవ్ర అవమానాల పాలు చేస్తున్నాడని పత్రికా విలేఖరుల సంఘం జిల్లా నాయకులు పారునంది వెంకటస్వామి తెలిపారు. 3వ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి మాట్లాడుతూ తాను రెండు సార్లు తన వార్డు లోనే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఉన్నందున అనేక విషయాలు తెలుపడానికి కార్యాలయానికి జిల్లా కలెక్టర్ ను కలువడానికి వెళ్ళగా తాను కలువనని తన చిట్టీని వెనక్కి పంపాడని ఒక మహిళ ప్రజా ప్రతినిధిని అవమానపరచిన జిల్లా కలెక్టర్‌పై తక్షణమే చర్య తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమములో సి.పి.యం. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, టిఆర్‌పి పార్టీ జిల్లా అధ్యక్షులు కట్ల సదానందం, జెయంఐ రాష్ట్ర కన్వీనర్ కన్నారపు పరశురాములు, టిఆర్‌యస్ (కవిత) పార్టీ జిల్లా నాయకులు అనంతుల ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ తనవైఖరిని 20రోజులలోపు మార్చుకోకపోతే అన్ని పార్టీలు కలిసి రాజకీయాలకు అతీతంగా ఈ రౌండ్ టేబుల్ తీర్మాణానికి కట్టుబడి పోరాటంచేయాలని తెలిపారు. ఈరౌండ్ టేబుల్ సమావేశములో సిఐటియు జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సింగారపు రమేష్, అంబేద్కర్ సంఘం జిల్లానాయకులు మల్లిగారి రాజు, సిపియం సీనియర్ నాయకులు యండి. దస్తగీర్, అవాజ్ జిల్లా కార్యదర్శి యండి. అజహర్, రజకసంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కొలిపాక నర్సింహులు, చేతివృత్తి దారుల సమన్వయ కమిటి జిల్లా కన్వీనర్ బూడిద గోపి, సిపిఎం పట్టణ కార్యదర్శి జోగుప్రకాష్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు పజ్జూరి జయహరి, పల్లేరుల లలిత, పొత్కనూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

---

# ఘనంగా హనుమాన్ జయంతోత్సవం

**తరిగొప్పుల, మే 12 ప్రభాతవార్త :**

ఆంజనేయస్వామి జయంతి పురస్కరించుకొని తరిగొప్పుల మండలంలోని పలుగ్రామాలలోని ఆలయాలలో ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయం, చెన్నకేశవస్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు, చాలీసా పారాయణం, యజ్ఞాది కార్యక్రమాలను భక్తితో నిర్వహించారు. అనంతరం హనుమాన్ మాలదారులు ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో శోభాయాత్రగా



పలువీధులలో ఊరేగించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఆ స్వామివారి చల్లనిచూపు, కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని వేడుకున్నారు.

---

# జనగామ వార్త



## ఎస్ఐఆర్ మ్యాపింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించాలి

### - వివరాల నివేదికలు సమర్పించాలి

### - జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :**

ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా తాజా ఓటరు జాబితాను ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్‌హాల్లో ఓటరు జాబితా (ఎస్ఐఆర్) అంశంమీద అదనపు కలెక్టర్ బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆర్డీవో, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు చేపట్టిన మ్యాపింగ్ వివరాలను కలెక్టర్ మండలాల వారీగా అడిగి తెలుసుకొని, పలుసూచనలు చేశారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో జనగామ జిల్లా, రాష్ట్రస్థాయిలో ముందంజలో ఉందని, ఈమేరకు వారం రోజుల్లోగా 90శాతానికి చేరుకోవాలన్నారు. ప్రతీరోజు మ్యాపింగ్ ప్రక్రియ వివరాల నివేదికను సమర్పించాలన్నారు. బీఎల్‌ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటానమోదు, పారదర్శకతతో పనిచేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓ గోపీరాం, అన్ని మండలాల తహసీల్దార్లు, చేర్యాల, ధర్మసాగర్, సిద్దిపేట తహసీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాల నియంత్రణపై సమీక్ష

### - యువత మత్తుకు బానిస కావొద్దు

### - జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

**జనగామ టౌన్, మే 12 ప్రభాతవార్త :**



మత్తుపదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మత్తుపదార్థాల నియంత్రణపై ఎక్సైజ్, పోలీసు, వైద్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో మత్తుపదార్థాల నియంత్రణపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ఇలాంటి అవగాహన కార్యక్రమాల ఏర్పాటుతో సమాజంలో మార్పు తీసుకురావచ్చన్నారు. మత్తుపదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని, దాబాల వద్ద ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. యువత మత్తుకు బానిస కావొద్దని, ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. అలాగే గుట్కా విక్రయాలను చేసే దుకాణాలమీద చర్యలు తీసుకోవాలన్నారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అక్రమ రవాణా, విక్రయాలపై పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎక్సైజ్ ఎస్పీ అనిత, ఆర్టీఓ శ్రీనివాస్‌గౌడ్, డీఎంహెచ్‌ఓ మల్లిఖార్జునరావు, ఇతర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రసాయన ఎరువులు తగ్గించండి భూమాతను కాపాడండి

### వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద

నల్లబెల్లి, మే 12, ప్రభాతవార్త



వ్యవసాయ సాగులో రసాయన ఎరువులు తగ్గించి భూమాతను కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ధర్తీ మాత బచావో నికరన సమితి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ రెవెన్యూ శాఖ లకు సంయుక్తంగా వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని ఐదు క్లస్టర్లలో ఉన్న రైతు వేదిక భవనంలో నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి బన్న రజిత అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా తాసిల్దార్ ముప్పు కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్లో ఆత్మ,పిడి, విజయనిర్మల, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, రైతులకు భూసారం పెరిగేందుకు సంబంధించిన పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ రసాయన ఎరువులు ఎక్కువ వాడడంతో భూసారం దెబ్బతింటుందని రాబోయే తరాల మునగడకు ప్రమాదం వాటిల్లుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అందరికీ అన్నం పెట్టే అన్నదాతలు విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడకూడదని ఆమె సూచించారు, సాధ్యమైనంతవరకు వ్యవసాయ సాగులో పచ్చి రొట్టె విధానాన్ని ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ సాగులో కృషి విజ్ఞాన కేంద్రం నుండి శాస్త్రవేత్తల సూచనలను సలహాలను ఎప్పటికప్పుడు అన్నదాతలు పాటించి భూసారహిత పంటలు పండించాలని ఆమె కోరారు. ప్రతి సంవత్సరం భూసార పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. నిషేధిత ఫర్టిలైజర్స్ విగ్రహాలు జరగకుండా వ్యవసాయ శాఖ రెవెన్యూ శాఖ పోలీస్ శాఖ షాపులపై ప్రత్యేక నిగా పెట్టాలన్నారు. ఇలాంటి చట్ట వ్యతిరేకమైన చట్టబద్ధతలేని రసాయన ఎరువులు పురుగుమందులు విక్రయించినట్లయితే షాపు యజమానులపై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు షాపు లైసెన్సులు రద్దు చేయాలని ఆమె సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ షాపులలో పోలీస్ ప్రొటెక్షన్ తో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలన్నారు. ఎరువుల సమతుల్యం వల్ల రాబోయే తరాలకు స్వచ్ఛమైన సారవంతమైన భూమిని బహుమతిగా అందించడమే మన లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఫర్టిలైజర్ షాపుల్లో స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించి రైతులకు కొనుగోలు చేసిన వస్తువులపై బిల్లులు ఇస్తున్నారా లేదా అని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. యూరియా డిఏపి తదితర వ్యవసాయకి సంబంధించిన బ్యాగులు బ్లాక్ మార్కెట్లకు తరలించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. గ్రామాలలో దర్తీమాత బచావో నికరన సమితికి సంబంధించిన కమిటీలను సర్పంచ్ అధ్యక్షతన రైతుల సహకారంతో వేయాలని ఆమె సూచించారు. ఈ కమిటీలలో వ్యవసాయ విస్తరణ అధికారి తో పాటు పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ పరిపాలన అధికారులను భాగస్వాములు చేయాలన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు వ్యవసాయ సాగులో సమతుల పద్ధతులను అవగాహన కల్పిస్తూ భూసారాన్ని కాపాడే బాధ్యత ప్రతి వ్యక్తి పై ఉందని సూచించాలన్నారు. ఈ టెలిఫ్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో రెవెన్యూ వ్యవసాయ శాఖ సిబ్బందితోపాటు పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ అందుకున్న గిరిజన యువతి

చెన్నారావుపేట, మే 12, ప్రభాతవార్త

మండలంలోని పుల్లయ్యబోడు గ్రామ శివారు లింగ్యతండాకు చెందిన బోడ సునిత అనే యువతి హైదరాబాద్లోని జవహార్లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటి నుంచి కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, పీహెచ్డి అందుకున్నట్లు స్థానికులు తెలిపారు. యువతి పరిశ్రమ నిర్దిష్ట ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ ఎన్హాన్స్మెంట్ కోసం డీప్ లెర్నింగ్బేస్డ్ రికమండర్ ఫ్రేమ్వర్క్అనే అంశంపై డాక్టర్. బి. క్రాంతి కిరణ్ మార్గదర్శకత్వంలో తన పరిశోధనను నిర్వహించారు. ఆమె 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు మహబూబాబాద్లోని తెలంగాణ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివి, బిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్, వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఆమె భారత ప్రభుత్వం నుండి ఎస్ టీ విద్యార్థులకు ఉన్నత విద్య కోసం జాతీయ ఫెలోషిప్కు కూడా ఎంపికైనట్లు, ఆమె పరిశోధన పని పారిశ్రామిక భద్రతను మెరుగుపరచడానికి, ప్రమాదాలను నివారించడానికి, కార్మికుల ఆరోగ్యాన్ని



రక్షించడానికి మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ వర్తింపజేయడంపై దృష్టి పెడుతుందన్నారు. ఈ సందర్భంగా యువతిని గ్రామస్తులు, తోటి స్నేహితులు, బందువులు అభినందించారు.

# భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు

చెన్నారావుపేట, మే 12, ప్రభాతవార్త

హనుమాన్ జయంతి వేడుకలు మండలంలో మంగళవారం భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఈ వేడుకలను పురస్కరించుకొని మండలంలోని పాతముగ్ధంపురం గ్రామానికి చెందిన యోగా గురువు ములుక ఐలయ్య కళావతి దంపతుల కుమారుడు రేవంత్ కుమార్ పుట్టిన రోజు వేడుకలను దేవాలయం వద్ద జరుపుకున్నారు. హనుమాన్ భక్తులకు, స్థానిక ప్రజలకు పండ్లు, మజ్జిగ ప్యాకెట్లను అందించారు. ఈ సందర్భంగా యోగా గురువు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి



భక్తిభావాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ అలువాల శ్రీనివాస్, మాజీ జడ్పీటిసి జున్నుతుల రాంరెడ్డి, మాజీ సర్పంచ్ హంస విజయరామరాజు, ములుక సాంబయ్య, ఈగ సత్యనారాయణ, కుమారస్వామి, వెంగలదాసు రవీందర్, ముత్యాల కుమారస్వామి, కుండె కుమారస్వామి, కుసుమ వీరభద్రయ్య, కుసుమ నరేందర్, కందకట్ల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

**-ఖాదర్పేటలో...**

ఖాదర్పేట గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హనుమాన్ కమిటి ఉపాధ్యక్షుడు నిలిగొండ సూరయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఉపసర్పంచ్ చాపల మధు, దామెరుప్పుల శేఖర్, కూస మధు, తోటకూరి రాజేష్, కూస శ్రీను, కొణకటి మల్లికాంబ, దిడ్డి స్వరూప, ఏకాంతం తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

చెన్నారావుపేట, మే 12, ప్రభాతవార్త

ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని జల్లి గ్రామ సర్పంచ్ యాట సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని జల్లి గ్రామంలో ఊర చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. చెరువు మట్టిని చెలకలల్లో వేసుకోవాలని రైతులకు సూచించారు. పని



ప్రదేశాల్లో కూలీలు ఎండదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెరుగు బాబు, వార్డు మెంబర్ సువ్వాలి, ఏపీఓ అరుణ, జల్లి ఫీల్డ్ అసిస్టెంట్ మర్రి సురేష్, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.




# శివాలయాన్ని కూల్చిన వారిపై కేసు నమోదు చేయాలి



ఖానాపురం, మే 12, ప్రభాతవారనత

కాకతీయులు నిర్మించిన 800 సంవత్సరాల చరిత్ర కలిగిన శివాలయాన్ని కూల్చిన వారిపై కేసు నమోదు చేయాలని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్ఐ రామ్మోహన్కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు దొంగల్లా అర్ధరాత్రి సమయంలో కూల్చివేసినందుకు వారిపై క్రిమినెల్ కేసులు నమోదు చేయాల్సిందేనని అన్నారు. చారిత్రాత్మక గుడి ఆవరణంలో గుప్తనిధులు ఉంటాయనే ఉద్దేశంతోనే దాదాపు 24 అడుగుల గొయ్యి తీశారని ఇది ఒక ప్రభుత్వ అధికారి చెప్పినా కూడా పట్టించుకోక పోవడం చాలా బాదాకరమైన విషయం అన్నారు. ఆలయం కూల్చివేతకు వాడిన మిషన్లను, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని దొరికిన నిధులను రికవరి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ తక్కళ్లపల్లి రవీందర్రావు, మండల పార్టీ అధ్యక్షులు మహాలక్ష్మి వెంకటరామ్నర్సయ్య, మాజీ ఎంపిపి వేములపల్లి ప్రకాష్రావు, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ బత్తిని శ్రీనివాస్, ఖానాపురం సర్పంచ్ డా.రమేష్, వల్లెపు శ్రీను, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ దేవినేని వేణుకృష్ణ, ముద్దంగుల సంపత్, తిరుపతిరెడ్డి, ఆబోతు అశోక్, శ్రీను, తక్కళ్లపల్లి బాబురావు, బాలుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



ఖానాపురం, మే 12, ప్రభాతవార్త

హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని మండలంలోని అన్ని దేవాలయాల్లో మంగళవారం అంజన్న భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలను నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో అర్చకులు పర్వతపు శివప్రసాద్శాస్త్రి ఆధ్వర్యంలో అంజనేయ మాలదారులకు ఇరుముడి కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీతారామ నామస్మరణతో భక్తులు పులకరించి పోయారు. ఈ పూజా కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు మచ్చిక అశోక్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వల్లెపు శ్రీనుతో పాటు భక్తులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నివారణకు అందరు సహకరించాలి

నెక్కొండ, మే 12, ప్రభాతవార్త

ప్రాణాంతకమైన క్షయ వ్యాధి నివారణకు అందరూ సహకరించాలని మండలంలోని నాగారం గ్రామ సర్పంచ్ నాంపల్లి విజయ అన్నారు. టీవీ ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నాగారం సబ్ సెంటర్ల లో మంగళవారం క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాధి వల్ల ఎంతోమంది చనిపోయే అవకాశం ఉందన్నారు టి బి ని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స పొందడం ఎంతో మంచిదన్నారు ఇందుకోసం ప్రభుత్వ ఆసుపత్రులను వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కాగా నిర్ధారణ శిబిరానికి వచ్చిన 80 మందికి ఎక్స్ రే పరీక్షలు పూర్తి చేయడం జరిగిందని వైద్యాధికారి డాక్టర్ అఖిల్ అన్నారు. ఈ కార్యక్రమంలోటిబి సూపర్వైజర్లు అశోక్, రంజిత్, శ్రీకాంత్, సంకీర్తన సిబ్బంది పద్మ ప్రవళిక ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

జయశంకర్ వార్త
భూపాలపల్లి, కాటారం, ఏటూర్‌నాగారం, ములుగు

# గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట

**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**పెద్దంపల్లి గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం**

రేగొండ మే 12 ప్రభాతవార్త :

ప్రజా ప్రభుత్వ హయాంలో గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దంపల్లి గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ



రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ గడ్డే రఘును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధికి పునాది అని అన్నారు. ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు గ్రామస్థాయిలోనే అందుబాటులో ఉండేలా గ్రామపంచాయతీ కార్యాలయాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ నూతన భవనం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, పిఏసిఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, ఉపసర్పంచ్ సకినాల రవీందర్, నాయకులు పున్నం రవి, ఎర్రబెల్లి రవీందర్ రావు, సమ్మిరెడ్డి, బండారి దేవేందర్, మహమ్మద్ ఫరూక్, రేగొండ సర్పంచ్ వారణాసి మౌనిక అజయ్, పెద్దంపల్లి గ్రామ వార్డు సభ్యులు ఎర్రబాటి రాజేందర్, ఏరాబాటి శివకృష్ణ, ఏరాబాటి పూజ, మడికొండ భార్గవి, అంబటి కార్తీక్, బోరాల శ్రీను, కార్యదర్శి పోషాల కుమార్, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా, డ్రైవర్ మృతి

రేగొండ మే 12 ప్రభాతవార్త :



అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని దమ్మన్నపేట గ్రామ శివారులో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రేపాకపల్లి గ్రామానికి చెందిన చేరి సుమన్ ( 37) టీఎస్ 25 డీ 9123 నెంబర్ గల ట్రాక్టర్ లో తన చిన్న నాయన చేరి ప్రభాకర్ రెడ్డికి సంబంధించిన ఫామ్ ఆయిల్ పంటను ట్రాక్టర్ లో ఎక్కించుకొని, తన వెంట చేరి సందేశం తీసుకొని పరకాలకు వెళ్లాడు. అక్కడ ఆయిల్ ఫాం పంటను అన్లోడ్ చేసి తిరిగి వస్తుండగా దమ్మన్నపేట గ్రామ శివారులో ప్రమాదవశత్తు ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడి డ్రైవర్ సుమన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తన వెంట ఉన్న వరుణ్ సందేశ్ కు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. ఈ మేరకు మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి సుధాకర్ తెలిపారు.

## సింగరేణి వెయ్యి క్వార్టర్స్ లో దొంగల బీభత్సం

**ఒకే రోజు 7 ఇండ్లల్లో చోరీ చేసిన వైనం**

గణపురం, మే 12, ప్రభాతవార్త

గణపురం మండలంలోని చెల్పూర్ శివారులోని సింగరేణి వెయ్యి క్వార్టర్స్ లో వరుస చోరీలు కలకలం రేపాయి. గుర్తుతెలియని దుండగులు 7 ఇండ్లల్లో చొరబడి తాళాలు పగులగొట్టి నగదు, బంగారు ఆభరణాలు అపహరించుకుపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలిసిన వివరాల ప్రకారంశనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఇండ్లల్లో ఎవరూ లేని ఇండ్లను గుర్తించి ఏకంగా 7 ఇళ్లలో చోరీలు చేసి నగదు, బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు.!!వెయ్యి క్వార్టర్స్ లో నివాసం ఉంటున్న మైలగాని శ్రావంతి ఇంట్లో బీరువా పగులగొట్టి 15 తులాల బంగారు చైన్, రెండు బంగారు ఉంగరాలు, 4 గ్రాము!!ల బంగారు కమ్మలు, రూ.15 వేల నగదు చోరీకి గురయ్యాయి. అదేవిధంగా గాజుల వెంకటేశ్వర్లు ఇంట్లో 5 గ్రాముల రెండు బంగారు కమ్మలు, 4 గ్రాముల వెండి, రూ.6 వేల నగదు మాయమయ్యాయి. పోతరవేని రాజేష్ ఇంట్లో 6 తులాల వెండి, 2 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. !!వేములపల్లి బాబురావు ఇంట్లో 10 తులాల వెండి, రూ.వెయ్యి నగదు దోచుకెళ్లారు. ఇదునూరి అరుణ్ కుమార్ ఇంట్లో నగదు మాత్రమే పోగొట్టుకున్నట్లు తెలిపారు. బడేబాజ్ విజయ్ ఇంట్లోకి దొంగలు ప్రవేశించినా విలువైన సామగ్రి దొరక్కపోవడంతో నష్టం జరగలేదు. గడప గోపికృష్ణ ఇంట్లోనూ ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదన్నారు.సింగరేణి కార్మికులు నివసించే కాలనీలో ఒకేసారి ఏడు ఇళ్లలో చోరీలు జరగడంపై ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో భద్రతా సిబ్బంది గస్తీ సరిగా నిర్వహించకపోవడమే ఇందుకు కారణమని ఆరోపిస్తున్నారు. వెంటనే పోలీసులు నిందితులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని, క్వార్టర్స్ లో భద్రత పెంచాలని బాధితులు కోరుతున్నారు.

## ఆస్తి కోసం వృద్ధ మహిళను హత్య చేసిన మనుమడు

**హత్య చేసిన నిందితులను రిమాండ్ కు తరలింపు**

గణపురం, మే 12, ప్రభాతవార్త





గణపురం మండలంలో ఆస్తి, డబ్బు కోసం వృద్ధ మహిళ (సొంత నానమ్మ) ను మనవడు, అతని భార్య కలిసి హత్య చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పెండ్యాల ఐలమ్మ (60) ను ఆస్తి డబ్బు కోసం మనవడు పెండ్యాల జకిందర్!! అతని భార్య అనుకృతి కలిసి కర్రలతో చితకబాది సోమవారం హత్య చేశారు. ఐలమ్మను ఆస్తి డబ్బు కోసం ప్రతిరోజు వేదించేవాడని దీంతో వృద్ధ మహిళ డబ్బులు ఇవ్వకపోవడంతో కోపాన్ని పెంచుకున్న భార్యాభర్తలు పథకం ప్రకారం కర్రలతో విచక్షణ రహితంగా తలపై బాధడంతో వృద్ధ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించాగా. నిందితులు నేరాన్ని అంగీకరించడంతో. అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా, 14 రోజుల న్యాయ పరమైన రిమాండ్‌కు పంపించినట్లు సిఐ కరుణాకర్ రావు తెలిపారు.

## కెటిపిపి ముందు నిరసన

గణపురం, మే 12, ప్రభాత వార్త



గణపురం మండలంలోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రధాన గేటు ముందు ఈ ఈఎఫ్ ఐ పిలుపు మేరకు తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనుగాల కుమార్. రాష్ట్ర జెన్కో యూనిట్ ప్రధాన కార్యదర్శి చిలువేరు మల్లయ్య. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పెండ్యాల మహేందర్ సురేష్ రాజు అల్లూరు సంపత్ బీరెల్లి రమేష్ గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి పోలీస్ స్టేషన్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో జిల్లా ఎస్పీ వార్షిక తనిఖీలు

ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్ వార్షిక తనిఖీల్లో భాగంగా భూపాలపల్లి పోలీస్ స్టేషన్ మరియు సబ్ డివిజన్ పోలీస్ ఆఫీస్ కార్యాలయాన్ని సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించారు. అనంతరం స్టేషన్ పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ విధానం, సిబ్బంది విధి నిర్వహణను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీతోపాటు డీఎస్పీ సంపత్ రావు, భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్, భూపాలపల్లి ఎస్సై మచ్చ సాంబమూర్తి తో పాటు పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వీలైనంత త్వరగా మక్కలను కొనుగోలు చేయాలి

**భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

రేగొండ మే 12 ప్రభాతవార్త :



వీలైనంత త్వరగా మక్కలను కొనుగోలు చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మక్కల కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. కళ్లంలో ఇంకా ఎంత మక్కలు ఉన్నాయని పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్ల మక్కలను కొనుగోలు చేశారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న ఆ రైతులతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం బస్తాల తూకం సరిగా చేయాలని, గన్ని సంచులు, టార్పాలిన్ లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సరిపడా వాహనాలను అందుబాటులో ఉంచి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్, డి సి ఓ వాలియా నాయక్, డిప్యూటీ తాసిల్దార్ అబ్దుల్ రజాక్, మండల వ్యవసాయ అధికారి వాసుదేవ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఆరుగురు పేకాట రాయుళ్లు అరెస్ట్

**రూ. 5వేల 290 నగదు స్వాధీనం**

రేగొండ మే 12 ప్రభాతవార్త :

పేకాట స్థావరంపై ఆకస్మిక దాడి చేసి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు గోరి కొత్తపల్లి ఎస్సై త్రిలోక్ నాథ్ రెడ్డి తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు గోరి కొత్తపల్లి మండలం చిన్నకోడెపాక గ్రామ శివారులోని నిర్మానుష్యమైన ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆకస్మిక దాడి చేసినట్లు ఎస్సై త్రిలోక్ నాథ్ రెడ్డి తెలిపారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న రూ. 5వేల290 నగదును, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన నిందితులు గండి నరేష్, సూర్య ప్రకాష్, లక్ష్మణ్, కిరణ్ లను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ధాన్యం,మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహించరాదు

**-వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



**మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:** వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. మంగళవారం మంత్రులతో కలిసి జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కొనుగోలు కేంద్రాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, హామాలీలు, తూకం యంత్రాలు తదితర సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాంలకు తరలించాలని, రవాణాకు అవసరమైన లారీలను అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో దాన్యం తడువకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్లకు దిశానిర్ధేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహాశబరీష్ మాట్లాడుతూ కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం, ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాలకు ప్రత్యేక అధికారులను నియమించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ధాన్యం, మొక్కజొన్న సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేసేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి దాన్యం, మొక్కజొన్న లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా పూర్తిచేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధనపు కలెక్టర్ అనిల్‌కుమార్, మధుసూదనరాజు, వెంకటేశ్వర్లు, రమేష్, నర్సింహారావు, సరిత, వెంకటేశ్వర్లు, విజయ, సాయిచరణ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మహబూబాబాద్ వార్త

మహబూబాబాద్, తొర్రూరు

## మరిపెడ పిహెచ్‌సిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



**మరిపెడ,మే12,ప్రభాతవార్త:** మరిపెడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి రవి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ ఆధునిక నర్సింగ్ వ్యవస్థకు పునాది వేసిన ఫ్లొరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని ప్రతి యెడాది మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో, రోగుల ప్రాణాలు కాపాడడంలో నర్సుల సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ సందర్భంగా నర్సింగ్ స్టాఫ్, పారామెడికల్ సిబ్బంది, ఆరోగ్య కార్యర్తలను శాలువాలతో సత్కరించారు. వైద్యులు పూజిత, స్వామి, సౌజన్య, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ లక్ష్మికుమారి, పల్లెదవాఖాన సిబ్బంది ఝాన్సీ, ఉపేంద్ర, అఖిల, సౌజన్య, సరిత, హెల్త్ అసిస్టెంట్ వీరయ్య, నర్సింగ్ ఆఫిసర్లు, ఏఎన్ఎంలు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

**మహబూబాబాద్ టౌన్,మే12,ప్రభాతవార్త:**




రాష్ట్రంలో ఇటీవల 17ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను తక్షణమే అరెస్ట్ చేయాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా, కెవిపిఎస్, సీఐటియు జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండి సాయి భగీరథ్‌పై కేసు నమోదై మూడు రోజులు కావోస్తున్నా ఇప్పటి వరకు అరెస్ట్ చేయకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎవరిమీద అయినా ఫొక్సో కేసు నమోదు చేసేనత 24గంటల్లో అరెస్ట్ చేయాలని చట్టం చెబుతున్నా బండి భగీరథ్‌కు ఇది వర్తించదా అని మండిపడ్డారు. బాలిక తల్లిదండ్రులను భయబ్రాంతులకు గురిచేసిన బండి సంజయ్ పాత్రపై విచారణ జరిపించాలన్నారు. సిట్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. తక్షణమే అరెస్ట్ చేయాలని లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు కందునూరు కవిత, దుడ్డెల రామ్మూర్తి, గంధసిరి జ్యోతిబసు, పట్ల మధు, కుమ్మరికుంట్ల నాగన్న, చాగంటి భాగ్యమ్మ, మహేందర్, రాకేష్, ఉపేంద్ర, మౌనిక, యాకయ్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీటి ఎద్దడి తీర్చాలి

**గార్ల,మే12,ప్రభాతవార్త:**



గార్ల మండలంలోని పినిరెడ్డిగూడెం, శేరిపురం, బాలాజీతండా, పోచారం గ్రామ పంచాయతీలలో నెలకొంటున్న మిషన్ భగీరథ మంచినీటి ఎద్దడిని తక్షణమే తీర్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం పినిరెడ్డిగూడెం గ్రామంలో బి.నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ శేరిపురం దగ్గర నూతనంగా నిర్మిస్తున్న సంపు నిర్మాణం పనులు నత్తనడకన జరుగుతున్నాయని దీంతో పంచాయతీ ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోచారం సమీపంలో మరో సంపు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా నిర్మాణంకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని ప్రభుత్వమే సంపు నిర్మాణం చేసి ప్రజలకు త్రాగునీరు అందించాలని కోరారు. పోచారం క్రాస్ రోడ్ నుండి బాలాజీ తండా వరకు ఎన్నో ఏండ్లక్రింత నిర్మాణం చేసిన బిటి రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని వెంటనే నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. కొండలమ్మ దేవాలయం వరకు కంకర పోసిన రోడ్డుకు బిటి వేయాలని ఈ సమస్యలపై ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని కోరారు. అదేవిధంగా గ్రామాల్లో వీదిలైట్లు, పారిశుద్ధ్య పనులు మెరుగుపరుచాలని కోరారు. మండల నాయకులు వంగూరి పెద్ద వెంకటేశ్వర్లు, మల్లెల నాగమణి, చింత ఎల్లయ్య, కొండయ్య, పద్మ, సీతారం, ఝాన్సీ, రాజారావు, సభ్యులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి

**బయ్యారం,మే12,ప్రభాతవార్త:**



బయ్యారం మండలకేంద్రంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ కొదండసీతారామచంద్రస్వామి ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ కార్యక్రమంతో ప్రారంభమైన అభిషేక కార్యక్రమాలు, ప్రత్యేక అర్చన, పూజా కార్యక్రమాలు నిర్వహించుకొని కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆలయం భక్తులతో శోభయమానంగా విరాజిల్లిందని ఆలయ అర్చకులు సుదర్శనచార్యులు తెలిపారు. రామాలయం నుండి ప్రారంభమైన బైక్ ర్యాలీ జగ్గుతండా, గాంధీసెంటర్, శివాలయం మీదుగా తిరిగి రామాలయం చేరుకుంది. దారి పొడవునా జై శ్రీరాం జై హనుమాన్ నినాదాలతో మండల కేంద్రం హోరెత్తింది. ధర్మం కోసం హిందువులందరూ ఏకతాటిపైకి రావాలని నినాదాలు చేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బైక్‌ర్యాలీలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## మొద్దుగలగూడెంలో మహా అన్నదానం



**మహబూబాబాద్ రూరల్,మే12,ప్రభాతవార్త:** హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని మొద్దుగలగూడెం గ్రామంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినోద్‌రెడ్డి మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా సీరోలు ఎస్సై సంతోష్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ డాక్టర్స్ సెల్ డాక్టర్ వీరన్ననాయక్‌లు ప్రారంభించారు. ప్రతి సంవత్సరం సొంత ఖర్చులతో వినోద్ రెడ్డి అన్నదానం నిర్వహించడం పట్ల వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్, కమిటీ సభ్యులు వీరన్న, రామచంద్రు, వార్డు సభ్యులు మని తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నిష్టగా శ్రీఆంజనేయస్వామి జన్మదిన వేడుకలు



**గార్ల,మే12,ప్రభాతవార్త:** గార్ల మండలకేంద్రంలోని తూర్పు ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం శ్రీరామ, అభయాంజనేయ స్వామి భక్తులు, ప్రముఖులు, మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో ఆంజనేయ స్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చకులు చిదంబరం స్వామి భక్తులచే స్వామివారికి హనుమాన్ కుంకుమలు అద్ది నూనెలు, తలమపాకులు, పండ్లు, పూలతో నిష్ఠగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కుల పాండురంగారావు భక్తజన మండలి సభ్యులు కలసి 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం భక్తితో నిర్వహించారు. జైశ్రీరామ్, జై హనుమాన్, భజరంగబలి అంటూ భక్తుల నామస్మరణలతో ఆలయం మారుమ్రోగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లఖండం రమేష్‌బాబు, కనకశేఖరం, లక్ష్మిశెట్టి శ్రీనివాస్, వేణుమాధవ్, శ్రీనివాసరావు, రంగారావు, సత్యనారాయణ, రమేష్, పాండురంగారావు, భక్తజన మండలి సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

## గార్లలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

**గార్ల,మే12,ప్రభాతవార్త:** గార్ల మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు హన్మంతరావు నర్సులు, వైద్య సిబ్బందితో కలసి కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రిలో నర్సులు రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తారని, రోగులు తొందరగా కొలుకోవాలని నర్సులు చేసే సేవలను కొనియాడారు. ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సీనియర్ నర్సింగ్ అధికారులు, నర్సులను శాలువాలతో సత్కరించారు. స్వాతి, రాణి, మెర్సి, ఝాన్సీరాణి, ఆశాలత, రజిని, స్పందన, వెంకటరమణ, సరిత, స్వాతి, శైలజ, లత, పాల్గొన్నారు.

## కొత్తపేటలో నీటి సమస్యకు నూతన బావితో పరిష్కారం



**బయ్యారం,మే12,ప్రభాతవార్త:** బయ్యారం మండలం కొత్తపేట గ్రామ ప్రజలకు త్రాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు సర్పంచ్ భూక్య ప్రవీణ్‌నాయక్ చేసిన భగీరథ ప్రయ్నతంలో భాగంగా కొత్తపేట కుంటలో మంచినీటి బావిని తవ్వించారు. గ్రామ ప్రజల త్రాగునీటి కొరతను తీర్చుటకు తవ్వించిన బావిలో నీరు సమృద్ధిగా పడడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య ప్రవీణ్‌నాయక్ నూతన బావిని సందర్శించి సంతోషం వ్యక్తం చేసి గ్రామస్థులకు శుభవార్త తెలిపారు. ఉప సర్పంచ్ రావి వీరభద్రరావు, వడ్లమూడి కోటేశ్వరరావు, బుర్ర దుర్గారావు, పెంటాల శ్రీనివాసరావు, కంచర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రత ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి

## సర్పంచ్ యాకయ్య

నరసింహుల పేట మే 12 ప్రభాతవార్త



పరిసరాలు పరిశుభ్రత ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని మండల కేంద్ర సర్పంచ్ పెదమాముల యాకయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రజలకు సరఫరా అవుతున్న వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు పాలకుల సహకారంతో మండల కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దానని ప్రతి ఒక్కరు పరిసరాలు పరిశుభ్రత పాటించినట్లయితే గ్రామ అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో రాజకీయం చేస్తున్నారని రైతుల ఆరోపణలు

నర్సింహులపేట,మే12 ప్రభాతవార్త



కొనుగోలు కేంద్రాల్లో పిఏసిఎస్ ఏర్పాటు చేసిన తాత్కాలిక సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించకుండా రాజకీయం ప్రదర్శిస్తున్నారని ఇన్చార్జిలుగా ఉండి రైతుల పట్ల వివక్షత చూపుతున్నారని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మండలంలోని నరసింహాపురం బంజర గ్రామానికి చెందిన రైతు కాలు నాయక్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతుల వద్ద రాజకీయం చేస్తున్నారని ఇన్చార్జిలుగా ఉన్న వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని కాంటాలు నిర్వహించకుండా మీది మాయిచ్చర్ రాలేదంటూ వారి ఇష్టం వచ్చిన వాళ్లకు కాంటాలు నిర్వహిస్తూ రాజకీయ వివక్షత చూపిస్తున్నారని వాపోయాడు. కంటాలైన ధాన్యానికి రవాణా వాహనాలను కేటాయించకుండా మీ సొంత వాహనాల ద్వారానే మిల్లుల వద్దకు చేర్చాలని ఆదేశిస్తూ హమాలీ సంఘాలను కూడా బెదిరిస్తున్నారని ఆరోపించాడు. సంబంధించిన అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పారదర్శకంగా వ్యవహరించే వారిని తాత్కాలిక ఇంచార్జిలుగా కొనసాగించాలని డిమాండ్ చేశాడు.

# వాణిజ్య పంటలపై దృష్టి సారించాలి కె వి కె శాస్త్రవేత్త సుహాసిని

నెల్లికుదురు మే 12 ప్రభాతవార్త:

రైతులు సంప్రదాయ పంటలపై మక్కువ విడనాడి వాణిజ్య పంటలపై దృష్టి సారించాలని కెవికె మల్యాల శాస్త్రవేత్త సుహాసిని అన్నారు మంగళవారం మండలంలోని నరసింహులగూడెం గ్రామంలో స్థానిక సర్పంచ్ గొడుగు జ్యోతి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడారు రైతులు మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలపై మొగ్గు చూపాలని రసాయనిక ఎరువుల వాడకం తగ్గిస్తూ సేంద్రియ ఎరువులు వాడుతూ సేద్యం చేయాలని రైతులకు సూచించారు వరి మొక్కజొన్న మిర్చి లాంటి పంటలే కాకుండా పండ్లు కూరగాయలు ఆయిల్ ఫామ్ సాగుకు రైతులు మొగ్గు చూపాలని అన్నారు ప్రభుత్వం సూచించిన వరి వంగడాలను వచ్చే ఖరీఫ్ సీజన్లో రైతులు నాటుకోవాలని వారికి సూచించారు మండల వ్యవసాయ అధికారి భూక్య మహేందర్, ఉప సర్పంచ్ వేసాల కృష్ణయ్య, ఏఈఓ మణికంఠ, హెచ్ ఈ ఓ విజయపాల్ రెడ్డి, పి ఎస్ ఎస్ డైరెక్టర్ తండా నరసయ్య, పంచాయతీ కార్యదర్శి వార్డు సభ్యులు పాల్గొన్నారు



# నేడు సర్పంచులకు వర్కషాప్

నెల్లికుదురు, మే 12 ప్రభాతవార్త :



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రత్యేక విద్యా వారోత్సవాల్లో భాగంగా నేడు గ్రామ సర్పంచ్ లకు విద్యా కార్యక్రమాలపై వర్కషాప్ నిర్వహించనున్నట్లు మండల విద్యా శాఖ అధికారి ఆంగోత్ రాందాస్ తెలిపారు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక విద్యా వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 11 నుండి 17 వరకు షెడ్యూల్ మేరకు అన్ని పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు సర్పంచులకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఏర్పాటు చేసిన వర్క్ షాప్ మండలంలోని 31 గ్రామ సర్పంచులు హాజరవ్వాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు అందరు తమ పాఠశాల గ్రామ సర్పంచులను తప్పని సరిగా వర్క్ షాపులో హాజరయ్యేలా ప్రత్యేకంగా ఆహ్వానించాలని కోరారు.

# నేడు ఇనుగుర్తిలో సర్పంచులకు ప్రత్యేక సదస్సు

## పల్లె ప్రగతి, విద్యా వికాసమే లక్ష్యం

## ఎంఈఓ రూపా రాణి

ఇనుగుర్తి, మే 12, ప్రభాతవార్త:



ప్రజా పాలన ప్రగతి ప్రస్థానం 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామీణ విద్యా వ్యవస్థ బలోపేతం చేయడంలో భాగంగా ఇనుగుర్తి మండల విద్యాశాఖ కీలక అడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న విద్యా వారోత్సవాల (మే 1117) నేపథ్యంలో బుధవారం ఇనుగుర్తి జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో సర్పంచులకు ఉదయం 9 నుండి సాయంత్రం వరకు ప్రత్యేక అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. బడిలో మౌలిక సదుపాయాల కల్పన, డ్రాపౌట్స్ తగ్గింపు, నాణ్యమైన మధ్యాహ్న భోజన పర్యవేక్షణ, ఆదర్శ పాఠశాలల రూపకల్పన తదితర కీలక అంశాలపై ఈ సదస్సులో సర్పంచులకు దిశానిర్దేశం చేయనున్నారు. మండల పరిధిలోని సర్పంచులందరూ ఎలాంటి మినహాయింపులు లేకుండా విధిగా హాజరుకావాలని ఇనుగుర్తి మండల విద్యాశాఖ అధికారి జంగా రూపా రాణి ఆదేశించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తీసుకునే ఈ నిర్ణయాల్లో ప్రజా ప్రతినిధులు సకాలంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# గోదాంను పరిశీలించిన ఎమ్మెల్యే

మొగుళ్లపల్లి, మే,12, ప్రభాత వార్త:

మండల కేంద్రంలోని మార్కెట్ గోదాంను మంగళవారం భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రైతులు పండించిన మొక్కజొన్న ధాన్యం రవాణా, నిల్వ, హమాలీ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే ఫోన్లో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మొక్కజొన్న దిగుబడులను సరైన సమయంలో తరలించి నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు నష్టం వాటిల్లకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. హమాలీ చార్జీలు, రవాణా సమస్యలు, గోదాంల సామర్థం వంటి అంశాలను ప్రత్యేకంగా పరిశీలించి రైతులకు ఎటువంటి ఆలస్యం లేకుండా సేవలు అందించాలని కోరారు. రైతుల కష్టానికి తగిన గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, వైస్ చైర్మన్ ఎండి రఫీ, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు.






# అంబులెన్స్ లోనే ప్రసవించిన గర్భిణి

నెల్లికుదురు మే12 ప్రభాతవార్త :



సాధారణంగా ఆసుపత్రికి వెళ్తేనే ప్రాణం నిలుస్తుందనే నమ్మకం ఉంటుంది. కానీ, చావు బతుకుల మధ్య పోరాడుతున్న ఓ గర్భిణికి అంబులెన్స్ సిబ్బంది దేవుడిలా మారి పునర్జన్మ ప్రసాదించారు. నిమిషం ఆలస్యమైనా ప్రమాదకరంగా మారే పరిస్థితిలో, అత్యంత సమయస్ఫూర్తితో వ్యవహరించి అంబులెన్స్ లోనే డెలివరీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. నెల్లికుదురు మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన సూర స్వాతి కి ప్రసవ వేదన మొదలవ్వడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108కి సమాచారం అందించారు. పెద్దవంగర అంబులెన్స్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని, బాధితురాలిని మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికమవ్వడంతో ప్రసవం అంబులెన్స్ లోనే చేయక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఈ.ఎం.టి రఘు అత్యంత చాకచక్యంగా డెలివరీ అసిస్ట్ చేయగా, స్వాతి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. పైలట్ నవీన్ ఎంతో అప్రమత్తంగా వ్యవహరించి గమ్యస్థానానికి చేర్చారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిపై గ్రామస్తులు, ఆసుపత్రి సిబ్బంది మరియు ఉన్నతాధికారులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# దేవాదాయ శాఖ భూములను ఆక్రమిస్తే చట్టారీత్యా చర్యలు

## దేవాలయ శాఖ పరిశీలికులు నందనం కవిత

నర్సింహుల పేట మే 12 ప్రభాతవార్త



మండలంలోని శ్రీ లక్ష్మీ ౣనరసింహస్వామి దేవాలయ భూములు జయపురం గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం భూములను మంగళవారం దేవాదాయ శాఖ వారి ఆధ్వర్యంలో అన్యక్రాంతమైన భూములపై సర్వే చేసి ఆక్రమణకు గురైన భూమిని గుర్తించి వాటిని స్వాధీన పరుచుకొని హద్దులు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా దేవాలయ శాఖ పరిశీలకులు నందనం కవిత మాట్లాడుతూ మండలం దేవాలయ శాఖకు సంబంధించిన భూములను ఎవరైనా ఆక్రమించుకున్న దేవాదాయ శాఖ చట్టం 30/87 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సర్వేర్ పసునూరి అనిల్ దేవాదాయ సిబ్బంది మార్క శేఖర్ కాలు పవన్ యోగానంద లక్షి ౣ నరసింహ స్వామి సేవా సమితి సభ్యులు బండి రమేష్ ప్రేమ్ కుమార్ గ్రామస్తులు నారాయణ చంద్రం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

నరసింహుల పేట మే 12 ప్రభాత వార్త



వ ం ం డ ల ం ల ో ని నర్సింహులపేట రామన్నగూడెం ముంగిమడుగు కౌసల్య దేవి పల్లి పెద్దనాగారం వంతడపల గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు నవీన్ నరసయ్య బండి రమేష్ ప్రేమ్ కుమార్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో మక్క రైతుల ఆందోళన

**గూడూరు, మే 12 ప్రభాతవార్త**

గూడూరులో మొక్కజొన్న రైతులు మరో మారు మంగళవారం రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. వేల సంఖ్యలో కాంటాలు వేసి ఉన్న మొక్కజొన్నల బస్తాలను గోదాములకు తరలించడానికి లారీలు సక్రమంగా రావడం లేదని, మరోవైపు అకాల వర్షాల భయం వెంటాడుతున్న క్రమంలో ఇంకా కొంతమంది రైతుల మక్కలు కాంటాలు కూడా కాలేదని, రోజుల తరబడిగా కొనుగోలు కేంద్రాల వద్దనే పడిగాపులు పడి విసిగిపోతున్నామని ఆరోపిస్తూ రైతులు గూడూరు బస్టాండ్ సెంటర్లో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఇటీవలి నెలరోజుల వ్యవధిలో మక్క రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయడం ఇది మూడోసారి. రైతులు రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకున్న గూడూరు సిఐ వినయ్ కుమార్ తన సిబ్బందితో అక్కడికి



చేరుకొని రైతులతో మాట్లాడారు. వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఆందోళన విరమింపజేసి రైతులతో సహా పీఏసిఎస్ కార్యాలయానికి తరలి వెళ్లారు. కాంటాలు, లారీల విషయంపై అక్కడ సీఐ రైతుల ముందే అధికారులతో మాట్లాడారు. లారీలు పంపించి మక్కలు తరలించే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు

## డబల్ బెడ్రూమ్ బిల్లులు ఇప్పించండి

**గూడూరు, మే 12, ప్రభాతవార్త**

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తమ గ్రామానికి మంజూరు చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల బిల్లులు ఇప్పించాలని కోరుతూ మండలంలోని ఏపూరు గ్రామానికి చెందిన లబ్ధిదారులు హౌజింగ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా హౌసింగ్ పీడీ పురుషోత్తంను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో నిరుపేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం కోసం ఏపూరు గ్రామానికి 25 డబుల్ బెడ్రూమ్ ఇండ్లను మంజూరు చేయగా లబ్ధిదారులు అప్పులు చేసి ఇండ్ల నిర్మాణాన్ని పూర్తిచేసుకున్నప్పటికీ నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి తమకు రావలసిన బిల్లులు చెల్లించలేదని వాపోయారు. ఇళ్లు పూర్తిచేసుకుని సంవత్సరం దాటుతున్నా ఇప్పటికీ బిల్లులు అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరి



కారణంగా తాము ఇబ్బంది పడుతున్నామని, తమకు రావలసిన బిల్లులను వెంటనే విడుదల చేసి న్యాయం చేయాలని బాధిత లబ్ధిదారులు కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బానోతు రామన్న , భూక్యా బిక్కు, బానోత్ చంద, ధరావత్ లచ్చు, జాటోత్ సతీష్, వాంకుడోత్ వద్య, బోడ నరేష్, బానోత్ సూర్య ఉన్నారు

## ఎరువుల కంపెనీ యాజమాన్యాల ఆంక్షలు నిలిపివేయాలి

**పరకాల మే 12 (ప్రభాత వార్త )**

ఎరువుల కంపెనీల యాజమాన్యాల తీరు వల్ల రైతులు, షాపుల డీలర్లు ఇబ్బందులు పడుతున్నారని, ఆంక్షలు విధించడం మానుకోవాలని పరకాల మండలం ఫర్టిలైజర్ పెస్టిసైడ్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎరువుల ధరలు రోజు రోజుకూ భారమవు తున్నాయని, మరో వైపు కంపెనీలు వివిధ ఉత్పత్తులను లింక్ రూపంలో ఇవ్వడం ద్వారా రైతులకు అదనపు భారం పడుతుందని వివరించారు. రవాణా చార్జీలు ఎక్కువగా ఉన్నందున ఆ భారం డీలర్లపైన పడి నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఫర్టిలైజర్లో ఎఫ్ఓఎల్ క్రింద యూరియా, డీఏపీ కాంప్లెక్స్, ఫొటాస్ లింకు ప్రోడక్టులు ఇవ్వకుండా ఎరువులు సరాపరా చేయాలని డిమాండ్ చేశారు. విత్తనాలు, ఎరువుల శాంపిల్స్ ఫెయిల్ అయితే కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత రెండేళ్లుగా కంపెనీలు రిటైల్ డీలర్ల కమిషన్లు తగ్గించాలని హోల్ సేల్ వ్యాపారులకు నేరుగా ఎమ్మార్పీ కే అమ్ముతుండడంతో, రవాణా, గోదాం, కరెంటు బిల్లులు కూడా గిట్టుబాటు కాక దుకాణాలను మూసివేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. లింక్ ఉత్పత్తులు అంటగట్టడాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు.



అంతేకాక కంపెనీలు ఎరువులను నేరుగా డీలర్ వద్దకే అందించాలన్నారు. ప్రస్తుతం రైల్వేషెడ్ల నుంచి మాత్రమే అందిస్తున్నారని, ఫలితంగా ఒక్కో బస్తాకు రవాణా చార్జీలు రూ.40 నుంచి రూ.50 వరకు భారం పడుతోందన్నారు. మార్జిన్ను కనీసం 8 నుంచి 10 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు

## ఇండ్ల గుర్తింపు ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తహసిల్దార్

**హసన్ పర్తి, మే 12, ప్రభాతవార్త.**



జన గణన 2027 లో భాగంగా జయగిరి గ్రామంలో ఇండ్ల గుర్తింపును క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని హసన్ పర్తి మండల తహశీల్దార్ శ్రీ పూజారి కిరణ్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారికి సర్వే గురించి పలు సూచనలు ఇచ్చి, నిబంధనల ప్రకారం సర్వేను పూర్తి చేయాలని సూచించాడు. తహసిల్దార్ వెంట మండల గణాంక అధికారి రోజా, జి పి ఓ ప్రవీణ్ , పంచాయతీ సెక్రటరీ రవీందర్ , ఉపాధ్యాయ బృందం సభ్యులు ఉన్నారు

## మావోయిస్టు పార్టీ అగ్రనేత పసునూరి.నరహరి అలియాస్ సంతోష్ లొంగుబాటు

**కాజిపేట్ మండల్ మే12(ప్రభాతవార్త)**



మావోయిస్టు పార్టీకి ఆ పార్టీలో అత్యంత కీలకమైన కేంద్ర కమిటీ పసునూరి.నరహరి అలియాస్ సంతోష్ తన భార్యతో కలిసి తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. దశాబ్దాల పాటు అడవిలో గెరిల్లా పోరాటం చేసిన ఓ అగ్రశ్రేణి నేత జనజీవన స్రవంతిలోకి రావడం పార్టీ కేడర్లో చర్చ నీయాంశమైం ది.హన్మకొండ జిల్లా కాజీపేట మండల పరిధిలోని సోమిడి,గ్రామానికి చెందిన పసున ూరి.నర్సమ్మ , వీరికి ఐదుగురు కొడుకులు.అందులో రెండో కుమారుడు నరహరి.ఇంటర్ మధ్యలో ఆపేశారు.1996 సంవత్సరంలో ఎల్బీ కళాశాలలో డిగ్రీ చదువుతుండగా మావోయిస్టు ఉద్యమాలు, విధానాలకు ఆకర్షితుడయ్యాడు.1996లో అజ్ఞాతంలోకి వెళ్లిన నరహరి, సుమారు మూడు దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో,పనిచేశారు.సిసిఎం,ఈఆర్బి సభ్యుడు,టిడి,ఇన్చార్జ్. పనిచేస్తున్నారు.జార్ఖండ్లో పార్టీలో టెక్నికల్ వింగ్,మిలిటరీ ఆపరేషన్లలో ఆరితేరిన ఆయన, ఇటీవల కేంద్ర కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొందారుజార్ఖండ్ అడవుల నుంచి రహస్యంగా తెలంగాణకు చేరుకున్న వీరు.తాజాగా పోలీసుల ఎదుట లొంగిపోయారు,మావోయిస్టు పార్టీ సిద్ధాంతకర్తల్లో ఒకరిగా, వ్యూహకర్తగా పేరున్న నరహరి లొంగుబాటు పార్టీకి పెద్ద లోటుగా విశ్లేషకులు,భావిస్తున్నారు. కీలక నేతలు ఒకరి తర్వాత ఒకరు లొంగిపోతుండటంతో మావోయిస్టు పార్టీ ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది.నరహరి లొంగుబాటుతో ఆయన భార్య (ఏపీకి చెందిన మహిళ) కూడా ఆయనతో పాటే,లొంగిపోయినట్లు పోలీసులు ధృవీకరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస ప్యాకేజీ కింద వారికి ఆర్థిక సాయం, రక్షణ కల్పిస్తామని అధికారులు ప్రకటించారు

## వెన్నం శ్రీకాంత్ రెడ్డి ని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**గంగారం ఏప్రిల్ 12,ప్రభాతవార్త**



మహబూబాబాద్ జిల్లా గ్రంధాలయం చైర్మెన్ గా నూతనంగా ఎన్నికైన వెన్నం శ్రీకాంత్ రెడ్డి,ని మంగళవారం ఆయన స్వగృహం రెడ్యాలలో గంగారం మండల అధ్యక్షులు, జాడి వెంకటేశ్వర్లు, కొత్తగూడ మండల అధ్యక్షులు, వజ్జ సారయ్య,ఉమ్మడి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరబోయిన మొగిలి, మాజీ ఎంపిపి రూపుసింగ్ లు, శ్రీకాంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసారు,

## నేడు విద్యా వారోత్సవాల సదస్సు

**గూడూరు, మే 12, ప్రభాతవార్త**

ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్య వారోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 13న మండలంలోని సర్పంచులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ సుజాత తెలిపారు. గూడూరు బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని, మండలంలోని అన్ని గ్రామపంచాయతీల సర్పంచులు ఆరోజు ఉదయం 9 గంటలకు హై స్కూల్ ప్రాంగణానికి చేరుకోవాలని ఎంఈఓ కోరారు.

## దీక్షా స్వాముల ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి

**గూడూరు, మే 12, ప్రభాతవార్త**



హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గూడూరులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ దీక్ష స్వాములు మంగళవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులను అలరించే విధంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రతి ఏటా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించే ఆనవాయితిలో భాగంగా మంగళవారం ఉదయం నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య గురు స్వాములు, హనుమాన్ దీక్ష స్వాములు పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శివాలయ ప్రాంగణంలో ఇరుముడులు ధరించి భక్తులు, కుటుంబ సభ్యులు వెంట నడవగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా బస్టాండ్ సెంటర్ కు వెళ్లి అక్కడి నుండి పుణ్యక్షేత్రాలకు తరలి వెళ్లారు.

## పిసిసి ని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**హసన్ పర్తి, మే 12,ప్రభాతవార్త**

ప్రభాకర్ హనుమకొండ జిల్లా పర్యటన కు వచ్చిన పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని మంగళవారం వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్ నాగరాజు డిసిసి అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీసం సురేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గరిగా రాజు, రామంచ ఐలయ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పోలేపల్లి బుచ్చిరెడ్డి, రాయపురం సాంబయ్య, తుల రవి, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు తలెత్తకూడదు

**మక్కలు,ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రశీదులు ఇవ్వాలి**

**హమాలీలను పూర్తి స్థాయిలో వినియోగించాలి**

**వీలైతే ప్రైవేటు గోదాములను తీసుకోండి**

**విడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ లతో సీఎం రేవంత్ రెడ్డి**



వరంగల్ సిటి మే12 ప్రభాతవార్త

మొక్కజొన్న,వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.మంగళవారం మొక్కజొన్న,వరి ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,తుమ్మల నాగేశ్వరరావు,కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,వాకిటి శ్రీహరి, సీతక్క,అడ్లూరి లక్ష్మణ్ కుమార్,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావుతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ రెవిన్యూ జి సంధ్య రాణి తో కలిసి పాల్గొన్నారు.సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని సూచించారు.ప్రైవేట్ గోదాము లను,కమ్యూనిటీ హాళ్లు,రైతు బజార్ లను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని సూచించారు.టార్పాలిన్ కవర్లు,గన్ని సంచులు, రవాణా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. హమాలీల కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని,అధిక డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులు రద్దు చేయాలని స్పష్టం చేశారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు రశీదులు ఇవ్వాలని,రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు.తడిసిన ధాన్యం కొనుగోళ్లకు కూడా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ప్రతి రోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తూ కొనుగోళ్ల పురోగతిని సమీక్షి ంచాలని అధికారులను ఆదేశించారు.ఇతర శాఖల మంత్రులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.ఇప్పటివరకు రూ.3,873 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయని,ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. ఈసారి మొక్కజొన్న దిగుబడి భారీగా వచ్చిందని,కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని తెలిపారు.ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం,మొక్కజొన్న తెలంగాణలోకి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ధాన్యం,మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని, రాబోయే నెల అత్యంత కీలకమని పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులతో సమావేశమై,మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ఆదేశాల మేరకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించి, రవాణా,గన్నీ సంచులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్య రాణి,జెడ్పి సీఈఓ రామిరెడ్డి,డీసీఎస్ఓ కిష్టయ్య,డీఆర్డీఓ నాగ పద్మజ,డీసీఓ నీరజ , అగ్రికల్చర్ అధికారి,ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ యం విజయ నిర్మల,డీఎం సివిల్ సప్లై సంధ్యారాణి,మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ చంద్రశేఖర్,జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ,ఎం. వి ఐ శోభన్ బాబు,లీగల్ మెట్రాలజీ అధికారి మనోహర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లపై సీఎండీ సమీక్ష

**15లోగా విద్యుత్ పనులు పూర్తి చేయాలని ఆదేశం**

**కాళేశ్వరంలో విద్యుత్ పనులను స్వయంగా పరిశీలించిన ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**

**భక్తుల సౌకర్యార్థం నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ**

**పుష్కర ఘాట్లు, పార్కింగ్ ఏరియాల్లో భద్రతా ప్రమాణాల పరిశీలన**

**అత్యవసర పరిస్థితుల కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు**

మహాదేవపూర్, మే 12, ప్రభాతవార్త



ఈ నెల 21వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విద్యుత్ ఏర్పాట్లను ఈ నెల 15 వరకు పూర్తి చేయాలని తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు.మంగళవారం కాళేశ్వరం వద్ద జరుగుతున్న పుష్కరాల ఏర్పాట్లను సీఎండీ స్వయంగా పరిశీలించారు. ఇందులో భాగంగా పుష్కర ఘాట్, బస్టాండ్ ప్రాంతం, పార్కింగ్ ఏరియా, భక్తులు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాలలో జరుగుతున్న విద్యుత్ పనులను నేరుగా పర్యవేక్షి ంచారు. తాత్కాలిక విద్యుత్ లైన్లు, స్ట్రీట్ లైటింగ్, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ భద్రతా చర్యలు, నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం తీసుకుంటున్న చర్యలపై అధికారులతో మాట్లాడారు.ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ...పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు నిరంతరాయంగా, సురక్షి తంగా విద్యుత్ సరఫరా అందించేందుకు ఎన్పీడీసీఎల్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. విద్యుత్ సంబంధిత పనులలో అధిక భాగం ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలిన పనులన్నింటిని ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పుష్కరాల సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయాలు తలెత్తకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉండాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా విద్యుత్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సీఎండీ వెంట సీఈ రాజు చౌహన్, ఎస్ఈ ములుగు బేతి బిక్షపతి, కాటారం డీఈ ఆపరేషన్ నాగరాజు, డీఈ టెక్నికల్ జగదీశ్, డీఈ (ఎంఆర్టీ అండ్ సి) సదానందం తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం పుష్కరాల కోసం ఎంపీఎల్ చేయూత...!

**పోలీసులకు 25 బ్యారికేడ్ల అందజేత**

**ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణే లక్ష్యం**

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో

రానున్న కాళేశ్వరం పుష్కరాలను పురస్కరించుకుని భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను మరింత కట్టుదిట్టం చేసేందుకు ప్రముఖ స్టీల్ పైప్స్ తయారీ సంస్థ మహాలక్ష్మి ్మ ప్రొఫైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంపీఎల్ ) ముందుకొచ్చింది. తమ సామాజిక బాధ్యతలో భాగంగా సుమారు రూ.2 లక్షల విలువైన 25 బ్యారికేడ్లను జిల్లా పోలీసు శాఖకు విరాళంగా అందజేసింది. హైదరాబాద్‌కు చెందిన ఎంపీఎల్ కంపెనీ ప్రతినిధులు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ని కలిసి ఈ బ్యారికేడ్లను అప్పగించారు. కంపెనీ బ్రాండింగ్ మేనేజర్ కార్తిక్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. పుష్కరాల సమయంలో భారీగా తరలివచ్చే భక్తజన సందోహాన్ని క్రమబద్ధీకరించడానికి ఈ బ్యారికేడ్లు ఎంతో ఉపయోగపడతాయని కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ.. పుష్కరాల వంటి భారీ వేడుకల నిర్వహణలో ప్రజల రక్షణ కోసం పోలీసు శాఖకు సహకరించిన ఎంపీఎల్ కంపెనీ యాజమాన్యాన్ని అభినందించారు. సామాజిక స్పృహతో కంపెనీ చేసిన ఈ సాయం ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం కంపెనీ మేనేజర్ కార్తిక్ గౌడ్‌ను ఎస్పీ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్ కుమార్, ఎంటిఓ ఆర్ఐ పూర్ణచందర్, ఎంపీఎల్ కంపెనీ ప్రతినిధులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## నేడు సీపీగెట్-2026 నోటిఫికేషన్ విడుదల

ఎడ్యుకేషన్ కేయూ, మే 12 ప్రభాతవార్త :



సీపీగెట్-2026పై రెండో సమీక్ష సమావేశం నిర్వహణ మే 13న సీపీగెట్-2026 నోటిఫికేషన్ విడుదల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2026-27 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహించనున్న సీపీగెట్-2026 ప్రవేశ పరీక్షకు సంబంధించిన రెండో సమీక్ష సమావేశం మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయ కమిటీ హాల్‌లో నిర్వహించినట్లు సీపీగెట్-2026 కన్వీనర్ ఆచార్య రాజేందర్ కట్ల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహించగా, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సమక్షంలో సమావేశం జరిగింది.సమావేశంలో వివిధ పీజీ కోర్సులకు సంబంధించిన సిలబస్, అర్హత నిబంధనలు, పరీక్ష నిర్వహణ విధి విధానాలు మరియు ఇతర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ అంశాలను తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి సమక్షంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించినట్లు కన్వీనర్ తెలిపారు.అలాగే, 2026-27 విద్యా సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రంలోని పీజీ కోర్సుల్లో ప్రవేశాలకోసం నిర్వహించే సీపీగెట్-2026 అర్హత పరీక్ష నోటిఫికేషన్‌ను మే 13న హైదరాబాద్‌లో విడుదల చేయనున్నట్లు ఆచార్య రాజేందర్ కట్ల వెల్లడించారు. ఈ సమావేశంలో టీజీసీహెచ్ఇ వైస్‌చైర్మన్ ఆచార్య పురుషోత్తం, సెక్రటరీ ఆచార్య శ్రీరామ్ వెంకటేశ్, డీన్లు ఆచార్య బి. సురేష్‌లాల్, ఆచార్య జి.హనుమంత్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి, అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య సి.జె. శ్రీలత, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి.వెంకట్రామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షలు కూడా నిర్వహించలేరా..!

**-ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డా.తిరునహరి శేషు**

ఎడ్యుకేషన్ కేయూ, మే 12 ప్రభాతవార్త :



నీట్ ఎంట్రన్స్ పరీక్షపత్రం రాజస్థాన్‌లో లీక్ కావటం వలన దేశవ్యాప్తంగా ఏప్రిల్ 23న నిర్వహించిన నీట్ ఎంట్రన్స్ పరీక్షను ఎన్‌టిఏ రద్దు చేయడంతో ఎంట్రన్స్ పరీక్ష వ్రాసిన 22లక్షల మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అభిప్రాయం వ్యక్తంచేశారు. 2024లో కూడా నీట్ పరీక్షపత్రం లీక్ కావటం వలన విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకి గురైనారని, దేశంలోనే అతిపెద్ద ఎంట్రన్స్ ఎగ్జామ్ అయినా నీట్ ను పారదర్శకంగా, సమర్థవంతంగా ప్రభుత్వమే నిర్వహించకుండా టెస్టింగ్ ఏజెన్సీకి అప్పజెప్పటం ప్రభుత్వ వైఫల్యంగానే భావించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఎంట్రన్స్ ఎగ్జామ్‌లలో ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్షలలో పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నప్పటికీ ప్రభుత్వాలు పారదర్శకంగా సమర్థవంతంగా అవినీతికి తావు లేకుండా పరీక్షలు నిర్వహించడంలో వైఫల్యం చెందటం వలన యువత, విద్యార్థులు, నిరుద్యోగులు నిరాశ నిస్పృహలకు గురవుతున్నారని అభిప్రాయం వ్యక్తంచేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు టెస్టింగ్ ఏజెన్సీలు పరీక్షల నిర్వహణలో వైఫల్యం చెందటం పారదర్శకంగా పరీక్షలు నిర్వహించలేకపోవటం వలన ప్రతిభగల విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. నీట్‌లాంటి అత్యున్నత వైద్య విద్యకి సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్‌కి నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు.

## సెన్సెస్-2027 హౌస్ లిస్టింగ్ పనులు పరిశీలించిన తహశీల్దార్



**ఆలేరు, మే 12 (ప్రభాతవార్త):**
ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలో సెన్సెస్-2027 కార్యక్రమానికి సంబంధించి హౌస్ లిస్టింగ్ బ్లాక్ తయారీ ప్రక్రియను ఆలేరు తహశీల్దార్ వి. ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న హౌస్ లిస్టింగ్ పనుల పురోగతిని పరిశీలించి, ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. హౌస్ లిస్టింగ్ బ్లాక్ తయారీ ప్రక్రియను రేపటి లోపు పూర్తి చేసి, సంబంధిత బ్లాక్ మ్యాపులను సిద్ధం చేసి సమర్పించాలని ఎన్యుమరేటర్లకు తహశీల్దార్ ఆదేశించారు. సెన్సెస్ ప్రక్రియను ఖచ్చితత్వంతో, సమయపాలన పాటిస్తూ నిర్వహించాలని సూచించారు. అనంతరం కొలనుపాక గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దార్ పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమం లో ఆర్ ఐ పూర్ణ చందర్, పంచాయతీరాజ్ సెక్రెటరీ భాస్కర్ రెడ్డి, జి పి ఓ శ్రీనివాస్, పి ఏ సి ఎస్ డైరెక్టర్ అరె మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు



**యాదగిరిగుట్ట మే 12, (ప్రభాత వార్త ):**
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం లోని పుష్కరిణి ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు, వేద పండితులు, పురోహితులు ఆధ్వర్యంలో వైభవోపేతముగా మన్యు సూక్త పారాయణంతో అభిషేకం భావించారు అనంతరం ప్రత్యేక అలంకారం చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం, సుందరకాండ పారాయణం, వేద పఠనం లక్ష తమలపాకులతో అర్చన చేశారు. ఆంజనేయ స్వామికి హనుమాన్ జయంతి సందర్భంగా మహామంగళహారతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహణా ధికారి శ్రీ భవాని శంకర్, అనువంశిక ధర్మకర్త శ్రీ భాస్కర్ ఆయన నరసింహ మూర్తి, ప్రధాన అర్చకులు మరియు అర్చక బృందం వేద పండితులు భక్తులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**తుర్కపల్లి ,మే 12 ప్రభాతవార్త**
తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు రానున్న వాన కాలం సాగుకు సంబంధించిన వ్యవసాయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు .ఈ సందర్భంగా సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కే మధుబాబు మాట్లాడుతూ రసాయనిక ఎరువులను మోతాదుకు మించి వాడకూడదని సేంద్రీయ ఎరువులను తప్పకుండా వాడడం అలవర్చుకోవాలని అన్నారు. విత్తనాలు ఎరువులు పురుగుల మందుల రసీదులను భద్రపరుచుకోవాలని అన్నారు. సాగు నీటిని వృధా చేయకుండా చూడాలని, వరిలో రైతులు వరి విత్తనాన్ని వారే తయారు చేసుకోవచ్చని తెలిపారు. చెట్లు భూగర్భ జలాల నిలువ నీటి వనరులను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ,కాబట్టి చెట్లను నాటాలని వివరించారు .వరిలో గట్ల నిండా నీరు పెట్టి సాగు చేయడం వలన దిగుబడులు తక్కువ అవుతాయని అనవసర నీటి వినియోగం వృధా ఖర్చు నష్టం అని వివరించారు .పురుగుమందులను విచక్షణతో వాడి ఆరోగ్యంలో పురుగుమందు అవశేషాలు లేకుండా చూడాలన్నారు. అనవసర రసాయన ఎరువులు వాడడం తగ్గించి భూమి ఆరోగ్యాన్ని పరిరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ బి భారతి, ప్రధాన శాస్త్రవేత్త రాకేష్, వ్యవసాయ విస్తరణ అధికారి తిరుమలరావు, బాలరాజు, జింకల ఎల్లేష్ యాదవ్, కనకయ్య, గణేష్, నరసింహులు, బిక్షపతి, వెంకటేశం, ముత్యాలు, నరసింహులు, కనకయ్య, పద్మ, లక్ష్మీ, రైతులు పాల్గొన్నారు

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



**నర్మెట, మే 12 ప్రభాతవార్త :**
నర్మెట మండల ప్రజలు హనుమాన్ జయంతిని మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయం నుండి హనుమాన్ దేవాలయాలు శ్రీ రామాలయాలు భక్తులతో మాలధారణ స్వాములతో కిటకిటలాడాయి. మాలధారణ దీక్షలు చేపట్టిన స్వాములు మంగళవారం ఇరుముడులు ధరించి కొండగట్టు, వేములవాడ, ధర్మపురి, భద్రాచలం తదితర దేవాలయాలకు తరలివెళ్లారు. దీంతో గ్రామాలలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మండలకేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో ప్రయాగ నాగభూషణ శర్మ, శ్రీపాదశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించిన భక్తులు స్వాములు తీర్థఅన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆమెడపు లక్ష్మారెడ్డి, బి.సత్యనారాయణ, చిర్ర మహిపాల్‌రెడ్డి, ప్రజ్ఞాపురం సత్యనారాయణ, ఆమెడపు అంజిరెడ్డి, మహేశ్వరం రామకృష్ణ, చిర్ర రాజిరెడ్డి, రాపాక మహేష్, కొప్పుల రాజు, ప్రజ్ఞాపురం శ్రీనివాస్, కూరపాటి శ్రీనివాస్, రాజు, ఆకాష్, అవినాష్, అరవిందు, చిర్రా వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ విగ్రహానికి మకరతోరణం ఏర్పాటు

**బచ్చన్నపేట, మే 12 ప్రభాతవార్త :**



బచ్చన్నపేట మండలంలోని వీఎస్ఆర్ నగర్ వీరహనుమాన్ దేవాలయంలో హనుమాన్ విగ్రహానికి మకరతోరణం ఏర్పాటు చేయించి అడ్వకేట్ చింతల ఆంజనేయులు తన భక్తిని చాటుకున్నారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తూ భక్తులసౌకర్యార్థం ఈ మకరతోరణం ఏర్పాటు చేయడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అడ్వకేట్ చింతల ఆంజనేయులకు కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి భక్తులు ముందుకు రావడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా హనుమాన్ జయంతి
### - లోక కళ్యాణార్థం శతకోటి జపయజ్ఞం



**బచ్చన్నపేట, మే 12 ప్రభాతవార్త :**
బచ్చన్నపేట మండలవ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. జయంతిని పురస్కరించుకుని ఆలయాల్లోని మూలవిరాట్‌కు అర్చకులు సింధూరలేపనం, విశేష అభిషేకాలు నిర్వహించారు. విశ్వశాంతి, లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ ఆలయ ప్రాంగణాల్లో హనుమాన్ అష్టోత్తర శతకోటి జపయజ్ఞం, శ్రీరామ నామ లేఖన మహాయాగాన్ని వైభవంగా చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, అర్చనలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు భారీగా అన్నప్రసాద వితరణ చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో వివిధ గ్రామాల అర్చకులు, వివిధగ్రామాల ఆలయ కమిటీసభ్యులు గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లాకేంద్రంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు
### - తమలపాకులపై శ్రీరామ నామం





**జనగామ టౌన్, మే 12 ప్రభాతవార్త :**
జనగామ జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డ శ్రీ ఉమామహేశ్వర దేవాలయంలో, సంతోషి మాత ఆలయంలోని హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా






నిర్వహించబడ్డాయి. ప్రత్యేకంగా గుండ్లగడ్డ కాలనీకి చెందిన భక్తులు ప్రతీఇంటి నుంచి తమలపాకులపై శ్రీరామ సీతారామ" అని రాసి ఆలయానికి తీసుకువచ్చి హనుమంతుడికి సమర్పించడం ఆకట్టుకుంది. అలాగే అమ్మబావిప్రాంతంలోనిహనుమాన్ దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అయ్యగారులు శ్రీనివాస్, సాంబమూర్తి శర్మ, పవన్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారికి వివిధ రకముల ప్రసాదములు నివేదన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్, శ్రీనివాస్, శ్రీను, ప్రభాకర్, నిఖిల్, చారి, విగ్నేష్, అనురాధ, రాణి, మాధవి, రమ, ఉమా, మ్యాగీ, శ్రీవల్లి తదితర భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



### - కొండగట్టుకు మాలధారణ స్వాములు

**కొడకండ్ల, మే 12 ప్రభాతవార్త :**
కొడకండ్ల మండలకేంద్రంతోపాటు మండలంలోని అన్ని హనుమాన్ ఆలయాల్లో హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని హనుమాన్ మాలధారులు 41రోజుల దీక్ష పూర్తిచేసి మంగళవారం రామాలయంలో ఇరుముడి కట్టుకుని కొండగట్టు యాత్రకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచ్ మమత సతీష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలు అందరూ భక్తిమార్గంలో నడుస్తూ ధర్మపరిరక్షణకు కృషి చేయాలన్నారు. హనుమాన్‌దీక్ష చాలాకఠినంగా ఉండే దీక్షను విజయవంతంగా పూర్తి చేసుకున్న స్వాములు ఎంతోపుణ్యం పొందుతారన్నారు. అనంతరం స్వాములకు వేదపండితులు పిండిపోలు నాగ దక్షిణామూర్తి, మౌర్యశర్మల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దూలం సతీష్, కోట మల్లికార్జున్, మాలధారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేటర్లకు ఇచ్చిన ఏరియా పూర్తి చేయాలి...

### మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి



**జమ్మికుంట హుజూరాబాద్, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకున్న జనాభా నమోదు ఎన్యూమరేటర్లకు కేటాయించిన ఏరియాలో ప్రతి ఇంటిని సర్వే చేయాలని మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి మంగళవారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా గణన 202627 జనాభా నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల ఎన్యూమరేట్లు మీ ఇంటికి వచ్చి జనాభా గణన నమోదు చేస్తారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు కేటాయించిన ఏరియాలో ప్రతి ఇంటికి వెళ్లి సెన్సెస్ వివరాలలో పొందుపర్చిన ప్రతి అంశాన్ని నింపి, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం పూర్తి చేస్తారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈ కార్యక్రమం పూర్తి చేస్తారని, ఈ సర్వే పూర్తి కావడానికి అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రనిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట టిపివో శ్రీధర్, టిపిబివో దీపిక, ఎన్యూమరేటర్లు పలువురు పాల్గొన్నారు.

## ఏబీ స్విచ్‌లతో విద్యుత్ అంతరాయాలకు చెక్

**ఎస్ఈ బి.బిక్షపతి.**

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త.** వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు ములుగు సర్కిల్‌లో విద్యుత్ వ్యవస్థ బలోపేత పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఎన్పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. బిక్షపతి తెలిపారు. సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు 124 సింగిల్ ఫేజ్ ఏబీ స్విచ్‌లు, 160 త్రీఫేజ్ ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వీటి వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడిన ప్రాంతానికే సరఫరా నిలిపివేసి, మిగతా ప్రాంతాలకు నిరాటంకంగా విద్యుత్ అందించవచ్చని పేర్కొన్నారు.చెట్ల కొమ్మలు తగలడం, భారీ వర్షాలు, ఈదురు గాలులతో ఏర్పడే ఫాల్ట్‌లను త్వరగా గుర్తించి మరమ్మతులు చేపట్టేందుకు ఏబీ స్విచ్‌లు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. దీంతో ట్రిప్పింగ్ సమస్యలు తగ్గడంతో పాటు విద్యుత్ నాణ్యత మెరుగు పడుతోందన్నారు. మరమ్మతుల సమయంలో సిబ్బంది భద్రత పెరగడంతో పాటు విద్యుత్ పంపిణీ వ్యవస్థ మరింత పటిష్టంగా మారుతోందని వివరించారు. అత్యవసర విద్యుత్ ఫిర్యాదుల కోసం వినియోగదారులు టోల్‌ఫ్రీ నంబర్ 1912 ను సంప్రదించాలని సూచించారు.

## అకాల వర్షం: అన్నదాతలు ఆగం

### తడిసిన ధాన్యరాశులు, ఆగమైన అన్నదాతలు

**గోవిందరావుపేట, ప్రభాతవార్త** గోవిందరావుపేట మండలంలో మంగళ వారం రాత్రి సమయం 9:10 నిమిషాలకు కురిసిన అకాల వర్షం రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మండలాన్ని అతలాకుతలం చేసింది. కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యరాశులు ఎక్కడికక్కడ నిలిచిపోయి. వర్షార్పణ మయ్యాయి. టార్పాలిన్లు కప్పినా కింద నుంచి చేరిన వర్షపు నీరు ధాన్యాన్ని పూర్తిగా తడిపేసింది.రైతులు కళ్ల ముందే పంట ధాన్యరాశులు కన్నీరుమున్నీరయ్యారు.కాంటాలు ఆలస్యం కావడంతో గత వారం రోజులుగా కేంద్రాల నిండా ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. వాన పడుతుందని అధికారులు ముందస్తు హెచ్చరికలు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.మామిడి తోటల్లో ఈదురుగాలుల ధాటికి కాయలు నేలరాలి మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.పలు గ్రామాల్లో ఇళ్లపై రేకుల పైకప్పులు ఎగిరిపోయి ప్రజలు భయాందోళనకు గురయ్యారు.ధాన్యం తేమశాతం పెరిగితే కొనుగోలుకు ఇబ్బందులు తప్పవని రైతులు వాపోతున్నారు. తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని అన్నదాతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షం పదేపదే పడుతుండడంతో రైతాంగం భవిష్యత్తుపై బెంగ పెట్టుకుంది. వెంటనే మండలంలో ఉన్న అధికారులు స్పందించి బాసటగా నిలవాలని రైతులు కోరుకుంటున్నారు.

# హుజురాబాద్ ఏరియా ఆసుపత్రిలో సందడి

-- నర్సుల దినోత్సవం, అధికారుల తనిఖీ, ఫైర్ సేఫ్టీ అవగాహన



**జమ్మికుంటహుజురాబాద్, ప్రభాత వార్త:** స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మంగళవారం పలు కార్యక్రమాలతో సందడిగా మారింది. ప్రపంచ నర్సుల దినోత్సవ వేడుకలతో పాటు జిల్లా అధికారుల తనిఖీలు, అగ్నిప్రమాద నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

**-- ఘనంగా నర్సుల దినోత్సవం...**

ఆసుపత్రిలో ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని నర్సులు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నల్ల నారాయణ రెడ్డి సమక్షంలో నర్సులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకున్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో నర్సుల పాత్ర వెలకట్టలేనిదని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ ప్రసాద రావు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

**-- హెచ్.పి.వి టీకా కేంద్రం తనిఖీ...**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానంగా హెచ్.పి.వి టీకా కేంద్రాన్ని సందర్శించి, టీకా పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. 14 ఏళ్లు నిండిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా ఈ టీకా ఎంతో ఉపయోగపడుతుందని, దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్ కుమార్ ఉన్నారు.

**-- అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన...**

హుజురాబాద్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఆసుపత్రి వంటి రద్దీ ప్రదేశాలలో ప్రమాదం జరిగినప్పుడు రోగులను క్షేమంగా ఎలా తరలించాలో ఫైర్ సిబ్బంది ప్రత్యక్షంగా (డెమో) చేసి చూపించారు. ప్రతి ఒక్కరూ అగ్నిమాపక పరికరాల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ఉమా శ్రీ, ఆసుపత్రి వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## డబుల్ ఇంజిన్ సర్కార్ - డబుల్ టైం నీట్ పేపర్ లీక్.

### సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు గూగులోత్ సంతోష్ నాయక్.



**ములుగుజిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం ఎన్ టి ఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ) కలిసి లక్షలాది మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రమాదంలోకి నెట్టాయని సేవాలాల్ విద్యార్థి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ నాయక్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాయగా, మన రాష్ట్రం నుండి దాదాపు 70 వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారనీ తెలిపారు. గతంలో కూడా నీట్ పరీక్ష పేపర్ లీక్ అయినప్పటికీ, ఈసారి అయినా పకడ్బందీగా, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పరీక్ష నిర్వహిస్తారని అందరూ ఆశించారన్నారు. కానీ ఏ మాత్రం బాధ్యత లేకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమని వాపోయారు.ఇప్పటికే ఎన్ ఎమ్ సి నిబంధనలను సడలిస్తూ, వైద్య ప్రమాణాలను పాటించకుండా మెడికల్ కాలేజీలకు ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తున్నారన్నారు. వైద్య విద్యను ప్రమాదంలో పెట్టడమే కాకుండా, ప్రజల ప్రాణాలను కూడా ప్రమాదంలో పెడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికే అధికారికంగా నీట్ పేపర్ లీకేజ్ జరిగిన విషయం నిర్ధారణ కావడం, 180 ప్రశ్నల్లో 135 ప్రశ్నలు లీక్ కావడం దేశ విద్యా వ్యవస్థకు మచ్చగా మారిందన్నారు.దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని కేంద్ర విద్య శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని సంతోష్ నాయక్ డిమాండ్ చేశారు.

## బీసీ గురుకులాల్లో సీఈసీ గ్రూపుకు యధాస్థానం

**దేవరకొండ, మే 12, ప్రభాత వార్త :** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ నియోజకవర్గంలో ఉన్నటువంటి బాలుర,బాలికల బిసి గురుకులాలలో సీఈసీ గ్రూపును గురుకుల సెక్రెటరీ సైదులు తొలగించి వేరే కళాశాలకు మార్చగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆందోళన చేసి రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యకి విజ్ఞప్తి చేయగా గురుకుల సెక్రటరీతో మాట్లాడి సీఈసీ గ్రూపును యధా స్థానంలో తీసుకువచ్చినందుకు దీనితో పాటు జిల్లాలో ఉన్నటువంటి అన్ని బీసీ గురుకులాల్లో తొలగించినటువంటి గ్రూపు లన్నింటినీ యదా స్థానంలో తీసుకొచ్చినందుకు ఆర్.కృష్ణయ్యకి పాలాభిషేకం చేయడం జరిగింది. ఆయనకు దేవరకొండ నియోజకవర్గం, జిల్లా ప్రజల ప్రక్షాళన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో బీసీ గురుకులాలకు ఆయన చేసిన సేవలు పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రోత్సహించే విధంగా సహకరించారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, చేరుపెల్లి జయలక్ష్మి ,ఎండి రంజాన్ బేగ్, చిలువేరు ముత్తమ్మ, బీమగోని శివ గౌడ్, పెరికేటి శ్రీనివాస్ చారి, లైబ్రరీ శారద, శివ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష రద్దు చేయడం దుర్మార్గం

కట్టంగూర్, మే 12, ప్రభాతవార్త,




రాజస్థాన్‌లో నీట్ పరీక్ష పేపర్ లీక్ జరిగిందని నిర్ధారించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఏ) పరీక్షను రద్దు చేసినట్లు ప్రకటించడం దేశ విద్యా వ్యవస్థకు ఒక పెద్ద మచ్చగా నిలిచిందని బహుజన్ సమాజ్ పార్టీ భువనగిరి పార్లమెంటు ఇంచార్జి కత్తుల కాన్షీరామ్ విమర్శించారు. మంగళవారం అయిన కట్టంగూర్ లో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో మైనర్ బాలికలపై జరుగుతున్న దారుణ ఘటనలు, అధికార పార్టీలకు చెందిన ప్రముఖుల కుటుంబాలపై వస్తున్న ఆరోపణల నుండి ప్రజలు ఇంకా కోలుకోకముందే, ఇప్పుడు నీట్ పేపర్ లీక్ వ్యవహారం బయట పడటం దేశ ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ పాలనలో ఇది మొదటిసారి కాదు. గతంలో కూడా అనేక పరీక్షల లీకులు, అవినీతి ఆరోపణలు వెలుగులోకి వచ్చాయని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ వైఖరిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని విమర్శించారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో కూడా విద్య, ఉపాధి, విద్యార్థుల భవిష్యత్తు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం మరింత బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని, . ముఖ్యమంత్రి రాష్ట్ర విద్యార్థుల ఆందోళనలు, భద్రత, భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కాల్షియం డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థుల విద్య, పరీక్షల పారదర్శకత కంటే ఎన్నికలు, రాజకీయాలు, మత విద్వేషాలపైనే ఎక్కువ శ్రద్ధ పెట్టడం బాధాకరమని అన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నేడు ప్రశ్నార్థకంగా మారిందని, విద్యార్థి లోకానికి ఇది నిజంగా ఒక చీకటి రోజని కాన్సిరాం తెలిపారు

## దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి బదిలీ

**దేవరకొండ, మే 12, ప్రభాత వార్త :** దేవరకొండ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.ఆర్.ఓ మధుసూదన్ రెడ్డి బదిలీ అయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయనను రాష్ట్ర సచివాలయానికి (సెక్రటేరియట్) బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.దేవరకొండలో తన పదవీ కాలంలో మండల పరిపాలనలో తనదైన ముద్ర వేసిన ఆయన, ఇప్పుడు సచివాలయం వంటి కీలక విభాగంలో బాధ్యతలు చేపట్టనున్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కృషిని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు.కొత్తగా దేవరకొండకు రాబోయే తహసీల్దార్ ఎవరనే దానిపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది.